ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శనివారం 6 జనవరి 2024



- రంగవల్లులతో పులకించిన పుడమి
- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన
- విజేతలకు సెయింట్ ఆన్స్ కళాశాల బహుమతులు
- పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి



ఉత్సాహంగా రంగవల్లులు తీర్చిదిద్దుతున్న అతివలు

ఇలపై.. ఇంద్రధనుస్సు



ప్రథమ బహుమతి పొందిన వెదుళ్లపల్లికి చెందిన మల్లీశ్వరికి రూ.6వేలు నగదు బహుమతి అందజేస్తున్న డీఎస్పీ ప్రసాదరావు



చీరాల, జనవరి 5: ఇలపైకి ఇంద్రధనుస్సు దిగివచ్చింది. రంగ వల్లులతో చీరాల సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల పులకించింది. సందేశాత్మకంగా, సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి శోభను ముందస్తుగా కళ్లకు కట్టినట్లుగా రంగవల్లులను మహిళలు, యువ తులు తీర్చిదిద్దారు. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సంయుక్తంగా సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సౌజన్యంతో శుక్రవారం చీరాలలో ముగ్గుల పోటీ జరిగింది. స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్)లో నిర్వహించిన ముత్యాల ముగ్గులు పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు, యువతులు, విద్యార్థినులు హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులను తీర్చి దిద్దారు. రంగురంగుల ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి. పోటీల నేపథ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తొలుత పోటీలను కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణు గోపాలరావు, అక్రిడేషన్స్ మేనేజర్ డాక్టర్ సుబ్బారావులు ప్రారంభించారు. ఈ సం దర్భంగా జరిగిన సభలో డీఎస్పీ మాట్లాడు తూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలకు వచ్చిన స్పం దనను చూస్తుంటే సనాతన విధానం గుర్తు కొస్తుందన్నారు. మహిళలు, విద్యార్థినులు ఆపదలో పోలీస్ సహాయం పొందేందుకు దిశ యాప్ ద్వారా తక్షణ సహాయం పొందేందుకు ఉన్న వెసులుబాటును వివరించారు. డయల్ 100 ప్రయోజనాలను వివరించారు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో తల్లిదండ్రులు పిల్లలు ఏం చేస్తున్నారనే విషయంపై సునిశిత పరిశీలన అవసరమన్నారు.ఆంధ్రజ్యోతి ఒంగోలు ఎడిషన్ ఇన్‌ఛార్జి ఆళ్ల శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి సూర్యదేవర నవీన్‌బాబులు మాట్లాడుతూ రంగ వల్లుల పోటీలను సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. న్యాయనిర్ణేతలు మాట్లాడుతూ ప్రతి ముగ్గును మనస్సు పెట్టి మహిళలు, యువతులు తీర్చిదిద్దార న్నారు. ఒకదానికొకటి తక్కువ కాదన్నట్లు ఎంపికలో సవాల్‌గా నిలి చాయన్నారు. కళాశాల ఈవెంట్ టీం ప్రతినిధులు ఎక్కడ ఎవరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి చీరాల పీసీ పరిధిలోని పలువురు రిపోర్టర్లు, యాడ్స్ విభాగ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్
केनरा बैंक
Canara Bank
A Government of India Undertaking
Together We Can
ఆంధ్రజ్యోతి
ABN
AIMS INSTITUTES
Peenya, Bangalore
AIMS Admissions Centre
+91 81500 01994
www.theaims.ac.in/apply
admission@theaims.ac.in
AIMS
SWARGASEEMA
SUKETANA
Ph: + 91 98490 12500

విజేతల వివరాలు..

ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలో బాపట్ల మండలం వెదుళ్లపల్లికి చెందిన కొమర్నేని నాగమల్లేశ్వరి ప్రథమ బహుమతి సాధించారు. మార్టూరుకు చెందిన మద్దినేని పద్మావతి ద్వితీయ, చిన గంజాం మండలం కడవకుదురుకు చెందిన గున్నంనేని విజయశాంతి తృతీయ బహుమతి పొందారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలను విజేతలకు చీరాల డీఎస్పీ ప్రసాదరావు అందజేశారు. ఇంకొల్లుకు చెందిన మణి మంజరి, వేటపాలెం మండలం నీలకంఠాపురానికి చెందిన మౌనికశ్రీ, వేటపాలేనికి చెందిన కె.చందనసాయి, ఎం.మధు, అద్దంకి చెందిన కె.సుజాత, తిమ్మసముద్రానికి చెందిన సీహెచ్.శ్రీజలకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అంద జేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన పూరా శేషమాధవి, అమరా సునీత, రామిశెట్టి విజయలక్ష్మి ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు.



ద్వితీయ బహుమతి పొందిన మార్టూరుకు చెందిన పద్మావతికి రూ.4వేలు నగదు బహుమతి అందజేస్తున్న డీఎస్పీ ప్రసాదరావు



తృతీయ బహుమతి పొందిన కడవ కుదురుకు చెందిన విజయశాంతికి రూ.3వేలు నగదు బహుమతి అంద జేస్తున్న డీఎస్పీ ప్రసాదరావు

రాష్ట్ర స్థాయి బహుమతే లక్ష్యం



పదిహేనేళ్ల క్రితం ఆంధ్రజ్యోతి వారు నిర్వహించిన ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి పొందాను. మరలా ఇప్పుడు ప్రథమ బహుమతి వచ్చింది. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందాలన్నదే నా లక్ష్యం. మా పుట్టిల్లు వెదుళ్లపల్లి. మెట్టినిల్లు రేపల్లె. బహుమతి గెలుచుకోవడం చాలా ఆనందం.

- నాగమల్లేశ్వరి, ప్రథమ బహుమతి విజేత



కృషికి తగిన ప్రోత్సాహం



రంగవల్లులకు సంబంధించి నిర్వహిస్తున్న పోటీలో కృషికి తగిన ప్రోత్సాహం ఇస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. మరలా పోటీలో పాల్గొని ప్రథమ బహుమతి సాధిం చుకుంటాను. అందుకు అనుగుణంగా సాధన చేస్తాను.

- ఎం.పద్మావతి, ద్వితీయ బహుమతి విజేత, మార్టూరు



ఆనందంగా ఉంది



పోటీలో మొదటి స్థానం రానందుకు కొంత నిరాశ ఉంది. అయినా ఆనం దంగా ఉంది. మరోసారి ప్రథమ బహుమతి పొందేవిధంగా ప్రయత్నిస్తా. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తాను.

- జి.విజయశాంతి, తృతీయ బహుమతి విజేత, కడవకుదురు



నేడు ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ

- బాపట్ల తహసీల్దారు కార్యాలయం రోడ్డులో ఏర్పాట్లు
- ఇప్పటికే పెద్దసంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్న మహిళలు

బాపట్ల, జనవరి 5: ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీకి బాపట్ల ముస్తాబైంది. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన వారు సంయుక్తంగా జీఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత, కర్లపాలెం మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గుండ్రెడ్డి శివ సౌజన్యంతో పోటీలు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫైర్ స్టేషన్‌కు వెళ్లే సీసీరోడ్డుపై ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ప్రతి ఏడాది వలే ఈ ఏడాది కూడా పెద్దఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పోటీలో పాల్గొనే మహిళలు అనేక ప్రాంతాలు నుంచి పేర్లు నమోదు చేసుకున్నారు. పోటీలో పాల్గొనే వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున అందజేయనున్నారు. పాల్గొనే ప్రతి ఒక్కొక్కరికి ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నారు.

ఇలా చేరుకోవచ్చు..

బాపట్ల మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉప్పరపాలెం రోడ్డు నుంచి, బాపట్ల పాతబస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు నుంచి ముగ్గుల పోటీ జరిగే ప్రాంతానికి చేరుకోవచ్చు. పోటీలో పాల్గొనే మహిళలు ముగ్గు, రంగులు వారే తెచ్చుకోవాలి, చుక్కల ముగ్గు మాత్రమే వేయాలి. ముగ్గు వేయడానికి రెండు గంటల సమయం కేటాయించారు. ఇప్పటికే పేర్లు నమోదు చేయించుకున్నవారు కాకుండా మిగిలిన వారు 9985411056, 9985411240 నెంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చు. పోటీలకు అర గంట ముందుగా ప్రాంగణానికి రావాలని నిర్వాహకులు సూచించారు.



ఎంపీ లావుకూ.. నో?



- గుంటూరు వెళ్లమని జగన్ హుకుం
- అందుకు సుముఖత చూపని ఎంపీ
- మార్చొద్దని ఎమ్మెల్యేలు చెప్పినా ఆలకించని వైనం
- నరసరావుపేటలో అయితేనే పోటీ చేస్తానని చెప్పిన లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు కూడా సీఎం జగన్ మొండిచేయి చూపించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గుంటూరు ఎంపీగా పోటీ చేయమని హుకుం జారీ చేశారు. దాంతో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో పాటు ఆ నియోజకవర్గంలోని కొంత మంది ఎమ్మెల్యేలు కూడా విస్మయానికి గురయ్యారు. చిన్న వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చి నిజాయితీగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి పైనే దృష్టి కేంద్రీకరించిన ఎంపీకి ఈ పరిస్థితిని కల్పించడంపై అంతా అవాక్కవుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు కూడా తొలుత శ్రీకృష్ణదేవరాయలును గుంటూరులో పోటీ చేయమని చెప్పి తీరా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక నరసరావుపేటకు పంపారు. అయినా ఆయన ఏమాత్రం అభ్యంతరం పెట్టకుండా నరసరావుపేటకు వెళ్లి అక్కడ రాజకీయ ఉద్దండుడు రాయపాటి సాంబశివరావుపై పోటీ చేసి లక్షకు పైగా మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల్లో గెలిచిన రోజు నుంచి నియోజకవర్గ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ నిధులను మంజూరు చేయించారు. ఇవేమి పరిగణనలోకి తీసుకోకుండా ఇప్పుడు మళ్లీ నియోజకవర్గం మారాల్సిందిగా వైసీపీ అధిష్ఠానం ఒత్తిడి చేయడంపై పార్టీ పల్నాడు జిల్లా శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం పెల్లుబుకుతున్నది. తాజాగా శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయానికి శ్రీకృష్ణదేవరాయలును పిలిచి వచ్చే ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగాల్సిందిగా సీఎం జగన్ సూచించారు. అయితే అందుకు ఆయన సుముఖత చూపలేదు. తాను నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి అయితేనే ఎన్నికల్లో పోటీ చేస్తానని, కాదంటే బరి నుంచి తప్పుకుంటానని స్పష్టం చేసినట్లు సమాచారం. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును వైసీపీ అధిష్ఠానం పిలిచిందన్న విషయం ముందుగానే తెలుసుకున్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, మర్రి రాజశేఖర్ సీఎంవోకి వెళ్లి తమకు శ్రీకృష్ణదేవరాయలునే ఎంపీ అభ్యర్థిగా కేటాయించాలని చెప్పి వెనుతిరిగినట్లు సమాచారం. అయినప్పటికీ సీఎం జగన్ వారి విజ్ఞప్తులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా శ్రీకృష్ణదేవరాయలును గుంటూరు వెళ్లాల్సిందేనని చెప్పి పంపినట్లు తెలిసింది. క్లీన్ ఇమేజ్ ఉన్న శ్రీకృష్ణదేవరాయలుకే ఈ పరిస్థితి కల్పించారంటే ఇక ఆ పార్టీలో మిగతా వారి పరిస్థితి ఎలా ఉందో చెప్పకనే చెప్పినట్లు అవుతున్నది.

మైండ్‌గేమ్‌లా మార్పులు

గత కొన్ని రోజులుగా ఒక్కో జిల్లా నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలను తాడేపల్లి ప్యాలెస్‌కు జగన్ కోటరీ పిలిపిస్తూ మీకు ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం లేదని చెబుతున్నది. అలానే కొంతమందిని నియోజకవర్గాలను మారుస్తూ సమన్వయకర్తలుగా నియమిస్తున్నది. ఇప్పటికే రెండు జాబితాల్లో సమన్వయకర్తల పేర్లను ప్రకటించారు. వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొనగా దానిని కప్పిపుచ్చేందుకు మైండ్‌గేమ్‌లా అభ్యర్థులను ఎడాపెడా మారుస్తున్నారు. అలానే మహిళలు, బీసీలను ఉద్ధరిస్తున్నట్లుగా పైకి కలరింగ్ ఇస్తున్నారు. అవినీతికి, వివాదాలకు దూరంగా ఉంటూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్న వారిని కూడా నియోజకవర్గం మారమని ఒత్తిడి చేస్తున్నారు.

బయోలమయం

- ఊరుపేరు లేని పేర్లతో దిగుమతి
- పార్సిల్ కార్యాలయాల్లో టన్నుల కొద్దీ సరుకు



తెలంగాణ నుంచి వచ్చిన బయో మందులు

గుంటూరు సిటీ, జనవరి 5: గుంటూరును నకిలీ బయో మందులు ముంచెత్తుతున్నాయి. తెలంగాణ నుంచి వస్తున్న బయో ఉత్పత్తులతో నగరంలోని పార్సిల్ కార్యాలయాలు నిండిపో తున్నాయి. ఊరు పేరు లేని బయో మందులు టన్నుల కొద్దీ సరఫరా అవుతున్నాయి. వాటిని ఎవరు ఎక్కడకి పంపుతున్నారో.. ఎందుకు పంపుతున్నారో వంటి వివరాలు లేవు. లేబుళ్లు మార్చి రైతులను ఏమార్చే తంతులో నిఘావర్గాల పాత్రే ప్రశ్నార్థకమవుతుంది. హైదరాబాద్ నుంచి గుంటూరుకు ప్రతిరోజూ వందల టన్నుల బయో ఉత్పత్తులు వస్తున్నాయి. పార్సిల్ సర్వీసుల ద్వారా వీటిని తీసుకువచ్చి రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ లేబుళ్లు మార్చేసి మార్కెట్‌లోకి డంప్ చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 10 లక్షల ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగుతో ఇక్కడ అన్ని రకాల పురుగుల మందులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మిరప, మినుము, శనగ, మొక్కజొన్న, పొగాకు సాగు ఎక్కువగా ఉంది. దిగుబడి ఎక్కువగా సాధించేందుకు రైతులు పోటీలు పడి మరీ పురుగుమందులు వాడుతున్నారు. తెలంగాణలో ఎక్కువగా ఊరు పేరు లేని బయో మందులను తయారు చేస్తున్నారు. వాటిని మార్కెట్ చేసుకునేందుకు గుంటూరు మంచి వ్యాపార కేంద్రంగా మారింది. కొన్ని ప్రముఖ కంపెనీలు పేరుతో నకిలీ మందులను తీసుకొచ్చి లేబుళ్లు మార్చే వ్యాపారం కూడా ఇక్కడ ఎక్కువగా జరుగుతుంది. రైతులకు అంటగడుతున్న బయో మందుల్లో 90 శాతం నకిలీవే అని సమాచారం. వాటినే లైసెన్స్‌డ్ ఫర్టిలైజర్ దుకాణాల్లో అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. నకిలీ బయోలతో రైతులు నష్టపోతున్నారు. నకిలీ బయోల మార్కెటింగ్‌కు వ్యాపారులను ఆధారం చేసుకుంటున్నారు. పెద్దగా కష్టపడకుండా పెద్ద మొత్తంలో లాభం వస్తుండటం తో వారు రైతులను బురిడీ కొట్టించేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీల సమయంలో వీటిని పట్టించుకోవడంలేదు. ఒకవేళ పట్టుకున్నా తూతూమంత్రంగా కేసు నమోదు చేసి సరిపుచ్చుతున్నారే కాని కఠిన చర్యలు తీసుకోవడంలేదు. దీంతో జిల్లాలో నకిలీబయోల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయల అన్న చందంగా యథేచ్ఛగా సాగుతుంది. బయో మందులు వ్యాపారానికి సుమారు 300 మందికి లైసెన్సులు ఉండగా లైసెన్సు లేకుండా సుమారు 500 మంది వ్యాపారం చేస్తున్నారు. వారిలో చాలామందికి వ్యవసాయశాఖలోని ఉన్నతాధికారులతో మంచి సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అందువల్లే బయోల వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత శాఖలుపట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయి. గుంటూరు కేంద్రంగా బయో మందులపై నిఘా వర్గాలు నిద్ర నటిస్తున్నాయి.

దిక్సూచి DIKSUCHI

మహా జనపదాలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ



క్రీపూ.6వ శతాబ్దంలో ఏర్పడిన 16 రాజ్యాలను షోడశ మహా జనపదాలు అంటారు. దీనిని రెండో పట్టణీకరణ అని కూడా అంటారు. మగధ, అంగ, ఛేది, మల్ల, మత్స్య, కురు, గాంధార, అస్మక, కోసల, పాంచాల, కాంభోజ, వజ్జి మొదలైనవి వీటిలో ప్రధాన రాజ్యాలు.

క్రీ.పూ.600 నాటికి షోడశ మహాజనపదాలు 16 రాజ్యాలుగా ఏర్పడ్డాయి. ప్రస్తుత భారతదేశం అవతల గాంధార, కాంభోజ రాజ్యాలు ఏర్పడ్డాయి. దక్షిణ భారతదేశంలో ఏకైక రాజ్యం అస్మక. ఇది నేటి నిజామాబాద్ జిల్లా. దీని రాజధాని పోతలి(బోధన్). మిగతా రాజ్యాలన్నీ ఉత్తర భారతదేశంలో ఏర్పడ్డాయి. ఈ రాజ్యాల గురించి 'అంగుట్టనికాయ' అనే బౌద్ధ సాహిత్యంలో ఉంది. అవి...

అంగ: బెంగాల్, బిహార్‌లోని భాగల్‌పూర్, మాంఘర్ జిల్లాల ప్రాంతం. దీని రాజధాని చంప.

కాశీ: గంగానది తీరంలో మధ్య ఉత్తరప్రదేశ్ ప్రాంతం. దీని రాజధాని వారణాశి. వరుణ, అసి నదుల మధ్య ఉంది.

కోసల: ఉత్తరప్రదేశ్‌లోని సరయూ నది తీరప్రాంతం. దీని రాజధాని శ్రావస్థి, అయోధ్య

ఛేది: మధ్యప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతం. దీని రాజధాని శక్తిమతి

వత్స: యమునా నదీ తీరంలో ఈ మహాజనపదం ఉంది. దీని రాజధాని కౌశాంబి.

కురు: ఢిల్లీ పరిసర ప్రాంతం. దీని రాజధాని ఇంద్రప్రస్థం. నేటి ఆధునిక ఢిల్లీ. మలివేద కాలంలో భరత, పురు తెగలు కలిసి 'కురు' తెగగా ఏర్పడింది.

పాంచాల: ఉత్తర ప్రదేశ్‌లోని బదౌని, ఫరుకాబాద్ జిల్లాల్లో పాంచాల జనపదం ఉంది. దీని రాజధాని అహిచ్ఛిత్ర.

అవంతి: పశ్చిమ మధ్యప్రదేశ్ ప్రాంతం. దీని రాజధాని ఉజ్జయిని.

అస్మక: దక్షిణాపథ రాజ్యం. రాజధాని నిజామాబాద్ జిల్లాలోని బోధన్

మగధ: బిహార్‌లోని పట్నా, గయ జిల్లాల మధ్య ప్రాంతం. రాజధాని గిరివ్రజం, రాజగృహం, పాటలీపుత్రం.

శూరసేన: మధుర కేంద్రంగా యమునా నది తీర ప్రాంతం. రాజధాని మధుర

మత్స్య: రాజస్థాన్‌లోని జైపూర్ ప్రాంతం. దీని రాజధాని విరాట నగరం.

గాంధార: నేటి ఆఫ్ఘానిస్థాన్‌లోని కాందహార్ ప్రాంతం. దీని రాజధాని తక్షశిల నేటి రావల్పిండి.

కాంభోజ: నేటి ఆఫ్ఘానిస్థాన్

మల్ల: కుశినగర్, పావాపురి ప్రాంతాల్లో ఏర్పడిన జనపదం. రాజధాని పావపురి.

వజ్జి: ఉత్తర బిహార్ ప్రాంతం. దీని రాజధాని వైశాలి ప్రాంతం.

ముఖ్యమైన జనపదాలు:

1. మగధ, 2. అవంతి, 3. కోసల, 4. వారణాశి

పై రాజ్యాల్లో మగధ రాజ్య విస్తరణకు దోహదపడిన రాజవంశాలు వరుసగా...హర్యంక, శిశునాగ, నంద, మౌర్య.

హర్యంక వంశం

బింబిసారుడు ఈ వంశ స్థాపకుడు. భారతదేశ చరిత్రలో మొట్టమొదటి సారిగా సిద్ధ సైన్యం ఏర్పాటు చేశాడు. అంగరాజైన బ్రహ్మదత్తున్ని ఓడించి వారి రాజధాని 'చంప'ను ఆక్రమించాడు. బింబిసారుడు కోసల రాకుమార్తెను వివాహం చేసుకొని 'కాశీ' మహాజనపదాన్ని కట్నంగా పొందాడు. అవంతి రాజైన చంద్రప్రద్యోత మహాసేనతో యుద్ధాలు చేసి చివరికి సంధి కుదుర్చుకున్నాడు. బింబిసారుని ఆస్థానంలో 'జనకుణ్ణి' లేదా జీవకుడు అనే వైద్యుడు ఉండేవాడు.

ఆజాత శత్రు: తన తండ్రి బింబిసారుడిని సంహరించి రాజు అయ్యాడు. పాటలీపుత్రం పేరుతో నూతన నగరాన్ని నిర్మించాడు. ఇది ప్రస్తుత బిహార్ రాష్ట్ర రాజధాని పట్నా. కోసల రాజు ప్రసేన జిత్తు కుమార్తె వజ్జిరను వివాహం చేసుకున్నాడు. మహాశిల, రథముశాల అనే నూతన ఆయుధాలు తయారు చేశాడు.

ఉదయనుడు: పాటలీపుత్రను తన రాజధానిగా చేసుకున్నాడు. గంగ, శోణ, సరయూ, గండకి నదుల సంగమ స్థానంలో పాటలీపుత్రం ఉంది. కాబట్టి పాటలీపుత్రం నగరాన్ని గొప్ప జలదుర్గం అని అంటారు. ఉదయనుడు తరవాత అనిరుద్ధ, మండరాజు, నాగదాసకుడు వరుసగా పరిపాలించారు.

శిశునాగ వంశం

శిశునాగుడు: నాగ దాసకున్ని సంహరించి శిశునాగుడు ఈ వంశాన్ని స్థాపించాడు. వీరి రాజధాని వైశాలి.

కాల అశోకుడు: ఈ వంశంలో మరొక రాజు కాల అశోకుడు. ఇతడు బౌద్ధమతాన్ని ఆదరించాడు. ఈ వంశంలో చివరి వాడు కాకవర్ధిన్

నంద వంశం

శిశునాగ వంశాన్ని ఓడించి, నందవంశాన్ని మహాపద్మనందుడు స్థాపించాడు. ఇతనికి 'రెండో పరశురాముడు', 'ఏకరాట్' అనే బిరుదులు ఉన్నాయి. మహాపద్మనందుడు శూద్ర స్త్రీకి జన్మించినట్లు పురాణాల్లో ఆధారాలున్నాయి. మహాపద్మనందుడు కళింగ(ఒడిశా)పై దండెత్తి కొన్ని జైన విగ్రహాలను పాటలీపుత్రానికి తరలించాడు.

ధననందుడు: ఈ వంశంలో చివరి రాజు ధననందుడు. నంద రాజులను నవనందులు అని కూడా అంటారు. ఈ నంద రాజులను గ్రీకులు 'ఉగ్రసేనులు'గా వర్ణించారు. ధననందుని కాలంలో వాయువ్య ప్రాంతంలో అలెగ్జాండర్ భారతదేశంపై దండెత్తాడు. ధననందుడిని చంద్రగుప్త మౌర్యుడు ఓడించి మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు.

విదేశీ దండయాత్రలు

పర్షియన్లు: భారతదేశంపై తొలిసారిగా దండయాత్ర చేసిన విదేశీయులు పర్షియన్లు. పర్షియన్స్ అంటే ఇరానీయులు. వీరినే పారశీకులు అని కూడా పిలుస్తారు.

డేరియస్: పర్షియన్లను పాలించిన మొదటి డేరియస్ క్రీ.పూ.516లో పంజాబ్, సింధూ ప్రాంతాలను జయించి తన రాజ్యంలో కలుపుకొన్నాడు. ఆ కాలంలో రాష్ట్రాలను 'సంతృపి' లేదా 'సాత్రపి' అని పిలిచేవారు. ఈ రాజు కాలంలోనే పర్షియా రాజ్యంలో పంజాబ్, సింధూ ప్రాంతాలను 20వ సాత్రపిగా చేర్చారు.

గ్రీకులు: భారతదేశంపై దండయాత్రను చేసిన రెండో వారు గ్రీకులు. క్రీ.పూ. 356లో అలెగ్జాండర్ జన్మించాడు. ఇతని గురువు అరిస్టాటిల్. గ్రీకులకు, పర్షియన్లకు మధ్య అనేక యుద్ధాలు జరిగాయి. వీటి గురించిన పూర్తి సమాచారం 'హిస్టోరికా' గ్రంథంలో ఉంది.

- క్రీ.పూ.336లో తన తండ్రి మరణాంతరం అలెగ్జాండర్ సింహాసనం అధిష్ఠించాడు. అనేక గ్రీకు రాజ్యాలను జయించి ఏకీకృతం చేశాడు. తరవాత 'ఆసియా మైనర్' ప్రాంతాలపై దండెత్తాడు. ఈజిప్టును ఆక్రమించి నైలు నది ఒడ్డున అలెగ్జాండ్రియా అనే నగరాన్ని అలెగ్జాండర్ నిర్మించాడు. గౌగమేళ యుద్ధంలో పర్షియా రాజైన మూడో డేరియస్‌ను ఓడించాడు. వారి రాజ్యాన్ని కూడా ఆక్రమించాడు. వారి రాజధాని పెర్సిపోలిస్‌ను ధ్వంసం చేశాడు. అలెగ్జాండర్‌కు వ్యతిరేకంగా గౌగమేళ యుద్ధంలో పర్షియన్లతో కలిసి భారతీయులు కొంతమంది యుద్ధం చేశారు. దాంతో అలెగ్జాండర్ కాబుల్ ప్రాంతాలను ఓడించి కైబర్ కనుమల ద్వారా భారతదేశంలోకి ప్రవేశించాడు.
- అలెగ్జాండర్ తక్షశిల రాజైన 'అంబి'తో సైనిక ఒప్పందం చేసుకున్నాడు. అతనిని తన సామంతుడిగా మార్చుకున్నాడు. క్రీ.పూ.326వ సంవత్సరంలో అలెగ్జాండర్‌కు పురుషోత్తమ్(పోరస్)కు మధ్య హైడాస్పస్(జీలం నది) ఒడ్డున కర్రమైదాన ప్రాంతంలో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అలెగ్జాండర్ విజయం సాధించాడు. అంబి చక్రవర్తి అలెగ్జాండర్‌ను ఆహ్వానించి సహాయం చేశాడు. ఈ సందర్భంగా భారతీయుల పోరాటపటిమను అలెగ్జాండర్ ప్రశంసించాడు. పురుషోత్తమ్‌ను సత్కరించి, అతని రాజ్యాన్ని అతనికి ఇచ్చి ఒక రాజుగా గుర్తించాడు.
- భారతదేశ వాయువ్య ప్రాంతంలో అలెగ్జాండర్ తాను జయించిన ప్రాంతాలను, కాబుల్‌లోని ప్రాంతాలను కలిపి తన సైన్యాధ్యక్షుడైన సెల్యూకస్ నికేటర్‌ను గవర్నర్‌గా నియమించాడు.
- ఈ క్రమంలో తన సైనిక తిరుబాటు కారణంగా అలెగ్జాండర్ పాటలీపుత్రంపై దాడి చేయకుండానే మాతృదేశానికి పయనమయ్యాడు. మార్గమధ్యలో క్రీ.పూ.323లో ఇరాక్‌లోని బాబిలోనియా ప్రాంతంలో విష జ్వరంతో అలెగ్జాండర్ మరణించినట్లు గ్రీకు చరిత్రకారులు పేర్కొన్నారు. అయితే మరికొన్ని మత గ్రంథాల్లో మాత్రం.. పురుషోత్తమ్‌తో జరిగిన యుద్ధంలో గాయపడి, దాని ప్రభావం చేతనే అలెగ్జాండర్ మరణించినట్లు రాసి ఉంది.
- గ్రీకుల దండయాత్రతో భారతదేశంలో చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి.



డాక్టర్ ఐ.నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, సూర్యాపేట

గుజరాత్ మారిటైమ్ వర్సిటీలో ఎంబీఏ, ఎల్‌ఎల్‌ఎం

గాంధీనగర్‌లోని గుజరాత్ మారిటైమ్ యూనివర్సిటీ (జీఎంయూ)- ఎంబీఏ, మాస్టర్ ఇన్ లా(ఎల్‌ఎల్‌ఎం) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి.

ఎంబీఏ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్

దీనిని సంస్థ ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మారిటైమ్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తుంది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 106 క్రెడిట్స్ నిర్దేశించారు. ఈ ప్రోగ్రామ్‌ని డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్ బిజినెస్ స్కూల్ రూపొందించింది. ఆలిండియా కోటా కింద 30 సీట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు/పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: జాతీయ స్థాయిలో సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ రిమోట్లీ ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో సాధించిన మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, వెర్బల్ ఎబిలిటీ అండ్ కాంప్రహెన్షన్ నుంచి 70 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంటన్నర. నెగెటివ్ మార్కులు లేవు. ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు 70 శాతం, ఇంటర్వ్యూకి 30 శాతం వెయిటేజీ ఉంటుంది. సీమ్యాట్/క్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు నేరుగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎల్‌ఎల్‌ఎం

సంస్థ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ లీగల్ స్టడీస్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. మారిటైమ్ లా, ఇంటర్నేషనల్ ట్రేడ్ లా స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో మూడు కంపల్సరీ కోర్సులు, రెండు స్పెషలైజేషన్ కోర్సులు; రెండో సెమిస్టర్‌లో నాలుగు స్పెషలైజేషన్ కోర్సులు, ఒక డిజర్టేషన్ ఉంటాయి. సెమిస్టర్‌కు 13 చొప్పున మొత్తం 26 క్రెడిట్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయశ్రేణి మార్కులతో ఎల్‌ఎల్‌బీ/తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు, క్లాట్ అర్హత పొందినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో క్లాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు అవకాశం ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 5
- **వెబ్‌సైట్:** gmu.edu.in

ఐఐటీ మద్రాస్‌లో డేటాసైన్స్ అండ్ అప్లికేషన్స్



మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీఎం)- బీఎస్ ఇన్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ (2024 జనవరి బ్యాచ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇప్పటికే వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఉద్యోగార్థులకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు ఇంజనీరింగ్ అర్హత లేకున్నా ప్రోగ్రామర్లుగా, డేటా సైంటిస్ట్‌లుగా రాణించవచ్చు.

ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి. ఇందులో నాలుగు దశలు ఉన్నాయి. అవి ఫౌండేషన్ లెవెల్, డిప్లొమా లెవెల్, బీఎస్సీ డిగ్రీ లెవెల్, బీఎస్ లెవెల్.
- రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు అసైన్‌మెంట్స్ స్కోర్, క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ఫౌండేషన్ లెవల్‌కు అర్హత సాధిస్తారు. దీన్ని పూర్తిచేసిన తరవాత డిప్లొమాకు ఆ తరవాత బీఎస్సీ డిగ్రీకి, తరవాత బీఎస్‌కి అడ్మిషన్ లభిస్తుంది.
- ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023కి అర్హత పొందినవారు కూడా అడ్మిషన్ పొందవచ్చు. వీరు క్వాలిఫయర్ ఎగ్జామ్‌నకు బదులు నాలుగు గంటల క్విజ్‌లో అర్హత పొందాల్సి ఉంటుంది. క్విజ్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- ప్రోగ్రామ్ నుంచి ఏ దశలోనైనా అభ్యర్థులు నిష్క్రమించే వీలుంది. పూర్తిచేసిన కోర్సులకు సంబంధించి సంస్థ సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తుంది.
- ఫౌండేషన్ లెవెల్లో ఎనిమిది కోర్సులు ఉంటాయి. 32 క్రెడిట్లు నిర్దేశించారు.
- డిప్లొమా లెవెల్లో ఆరు థియరీ కోర్సులు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. 27 క్రెడిట్లు నిర్దేశించారు. ఈ లెవెల్లో ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉంటాయి. వీటిలో ఏదైనా ఒకదాన్ని లేదా రెంటినీ ఎంచుకోవచ్చు.
- బీఎస్సీ, బీఎస్ లెవెల్లో ఒక్కోదానికి 28 క్రెడిట్స్ నిర్దేశించారు.
- లెవెల్ వారీగా నిర్దేశించిన ఒక్కో అంతర్గత కోర్సు 12 వారాలు ఉంటుంది. ప్రతి వారం వీడియో క్లాసులు, అసైన్‌మెంట్స్ ఉంటాయి. మంత్లీ క్విజ్‌లు, ఎండ్ టర్మ్ ఎగ్జామ్‌లు కూడా నిర్వహిస్తారు.

అర్హత: ఇంగ్లీష్, మేథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల జాయింట్ సర్వీసెస్ వింగ్ ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఉత్తీర్ణులు; కనీసం అయిదు సబ్జెక్టులతో ఎన్ఐఓఎస్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; జనరల్ కేటగిరీ దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన దివ్యాంగులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 14
- **క్వాలిఫయర్ ఫేజ్ ప్రారంభం:** జనవరి 19 నుంచి
- **క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** ఫిబ్రవరి 25
- **ఫలితాలు విడుదల:** మార్చి 1
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** మార్చి 6 నుంచి 7 వరకు
- **వెబ్‌సైట్:** study.iitm.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/VYzIaSPలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

స్నేహానికి అద్దంపట్టేలా



నాగార్జున సంక్రాంతి కోడిపుంజు 'నా సామిరంగ'పై రోజురోజుకీ అభిమానుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. చాలాకాలం తర్వాత నాగ్ పూర్తిస్థాయి మాస్ పాత్ర చేయడంతో అభిమానులు సినిమాకోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. దర్శకుడు విజయ్ బిన్నీ వినూత్నమైన కాన్సెప్ట్‌తో సినిమాను తెరకెక్కించినట్టు చిత్రబృందం చెబుతోంది. ఇప్పటివరకూ విడుదలైన పాటలు యువతరాన్ని బాగా ఆకట్టుకున్నాయి. శుక్రవారం 'దేవుడే తన చేతిలో..' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఎం.ఎం.కీరవాణి రాసి స్వరపరిచిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. నాగార్జున, అల్లరి నరేశ్ పాత్రల స్నేహాన్ని అద్దంపట్టేలా ఈ పాటను చిత్రీకరించడం జరిగిందని, స్నేహం గొప్పతనం తెలిసేలా కీరవాణి సాహిత్యం సాగిందని వారు అన్నారు. అశికా రంగనాథ్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో రాజ్‌తరుణ్, మిర్నామీనన్, రుక్సార్ థిల్లాన్ ఇతర తారాగణం కాగా, ఈ చిత్రానికి రచన: ప్రసన్నకుమార్ బెజవాడ, కెమెరా: శివేంద్ర దాశరథి.


బ్రహ్మారాక్షసుడు వచ్చాడ్రా



గోపీచంద్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. కన్నడ దర్శకుడు ఎ హర్ష తెరకెక్కిస్తున్నారు. కేకే రాధామోహన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసి ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'రాక్షసుల్ని వేటాడే బ్రహ్మారాక్షసుడు వచ్చాడ్రా' అనే బ్యాగ్రౌండ్ వాయిస్‌తో మొదలైన టీజర్ గోపీచంద్ పాత్ర ఎలా ఉండబోతోందో చెప్పింది. పరిచయ సన్నివేశంలో గోపీచంద్ ఖాకీ యూనిఫాంలో ఎద్దుపై కూర్చొని మాస్ ఎంట్రీ ఇచ్చిన తీరుతో ఆయన పాత్ర ఎంత శక్తిమంతంగా ఉండబోతోందో తెలుస్తోంది. రవి బస్రూర్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. సినిమాటోగ్రఫీ: స్వామి గౌడ

రామ్‌చరణ్ సినిమాలో శివన్న?





బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందనున్న 'రామ్‌చరణ్ 16' పై వస్తున్న అప్‌డేట్‌లు మెగా అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. కోస్తా నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామాకు సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ తీసుకున్నారు. సీనియర్ హీరోయిన్ లయ ఈ సినిమాతో రీఎంట్రీ ఇవ్వనున్నట్టు తెలిసింది. ఇక ఇందులో చరణ్‌కు జోడీగా ముందు జాన్వీకపూర్ పేరు వినపడింది. తర్వాత ఆ స్థానంలో సాయిపల్లవి వచ్చి చేరింది. కథానాయికగా ఆమె దాదాపు ఖరారైనట్టు తెలిసింది. ఇప్పుడు మరో విశేషమేంటంటే.. ఈ సినిమాలో కన్నడ అగ్ర నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించనున్నారట. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే చెన్నయ్‌లోని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. 'ఆర్‌సీ16'లో తను నటించనున్నట్టు, ప్రస్తుతం ఆ విషయం చర్చల దశలో ఉన్నట్టు ఆయన తెలిపారు. శివరాజ్‌కుమార్ ఇటీవలే రజనీకాంత్ 'జైలర్‌'లో ప్రత్యేకపాత్రలో మెరిశారు. నిడివి తక్కువే అయినా.. ఆ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలిచింది. మళ్లీ 'ఆర్‌సీ 16'లో కనిపించనున్నారు. ఇది మెగా అభిమానులకు నిజంగా శుభవార్తే.

వెంకటేశ్‌తో సినిమా కోరిక తీరింది

వెంకట్ బోయనపల్లి



అందరూ 'సైంధవ్' చిత్రంలో పోరాట ఘట్టాల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు కానీ మనసుకు హత్తుకునే కుటుంబ అనుబంధాల గురించి దర్శకుడు హృద్యంగా తెరకెక్కించారు. థియేటర్ నుంచి బయటికొచ్చేటప్పుడు ప్రేక్షకుల కళ్లు చెమ్మగిల్లుతాయి' అని నిర్మాత వెంకట్ బోయనపల్లి అన్నారు. వెంకటేశ్ కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈనెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- వెంకటేశ్ గారు నా అభిమాన హీరో. ఆయనతో నిర్మాతగా ఓ సినిమా చేయాలనేది నా కోరిక. దర్శకుడు శైలేష్ కొలను చెప్పిన కథ నచ్చడంతో ఆయన వెంటనే 'సైంధవ్' చిత్రం చేసేందుకు అంగీకరించారు. ఒక్క రోజులోనే ప్రాజెక్ట్ ఓకే అవ్వడం ఆశ్చర్యం కలిగించింది. వెంకటేశ్ గారి 75వ చిత్రం చేసే అవకాశం నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను.
- ఈ సినిమాకు వెంకటేశ్‌గారిని ఒప్పించిన ఘనత శైలేష్‌కే దక్కుతుంది. మా ప్రయత్నం మేం చేశాం. ఇలాంటి కాంబినేషన్ కుదరడం విధిరాత అని వెంకటేశ్ అన్నారు. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, ఆండ్రియా లాంటి అగ్ర తారలు భాగమవడం, భారీ స్థాయిలో నిర్మించడం వల్ల ఖర్చు ఎక్కువే అవుతుందని తెలుసు. అందుకు ముందుగానే సిద్ధమయ్యాం. సంతోష్ నారాయణ్ సంగీతం సినిమాకు ప్రత్యేకాకర్షణ. అన్నీ కుదిరితే నాని, వెంకటేశ్ గారితో మల్టీస్టారర్ చేయాలనుంది.

మూడు తరాలు ఒకే ఫ్రేమ్‌లో



మోహన్‌బాబు మనవడు, విష్ణు తనయుడు అవ్రామ్ బాలనటుడిగా వెండితెరకు పరిచయమవబోతున్నాడు. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రంతో అవ్రామ్ తెరంగేట్రం చేయనున్నాడు. ఇందులో మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అంటే మోహన్‌బాబు విష్ణు, అవ్రామ్ ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల నటులు ఒకే ఫ్రేమ్‌లో అలరించనున్నారన్నమాట. శుక్రవారం విష్ణు ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'నా కొడుకు అవ్రామ్ 'కన్నప్ప' చిత్రంలో కీలకపాత్రలో నటిస్తున్నందుకు గర్వంగా ఉంది. ఇది మా కుటుంబంలోని మూడు తరాల కలయికలో వస్తున్న అరుదైన చిత్రం. మా కుటుంబంలో నూతన అధ్యాయానికి 'కన్నప్ప' నాంది పలుకుతుంది' అని చెప్పారు. ఈ చిత్రంలో ప్రభాస్ శివుడి పాత్రలో కనిపించనున్నారు. ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం ప్రధాన తారాగణం.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2U8inXv లో చదవండి.

శ్రీవారి సేవలో నటి జాన్వీ కపూర్



నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తన పిన్నమ్మ అయిన నటి మహేశ్వరి, స్నేహితులతో కలిసి ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల (ఆంధ్రజ్యోతి)

భుజం తట్టి ప్రోత్సహించారు





ఇటీవలే దివంగతులైన తమిళ హీరో విజయ్‌కాంత్‌ను తలచుకొని సూర్య కన్నీరు పెట్టుకున్నారు. విజయ్‌కాంత్ కన్నుమూసిన సమయంలో సూర్య విదేశాల్లో షూటింగ్‌లో ఉన్నారు. దాంతో చివరి చూపు దక్కలేదు. తిరిగొచ్చాక ఆయన గురువారం చెన్నైలోని విజయ్‌కాంత్ సమాధి వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంలో విజయ్‌కాంత్‌ను గుర్తు చేసుకొని సూర్య తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కెరీర్ ఆరంభంలో అపజయాలు రావడంతో నిరాశలో ఉన్న నన్ను విజయ్‌కాంత్ ఎంతగానో ప్రోత్సహించారు అని చెప్పారు. 'పెరియన్నా' సినిమాలో ఆయనతో కలసి నటించాను, ఆ సమయంలో ఆయన నన్ను ఆదరించిన తీరు ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు.



వెంకటపాలెం రైతు ధర్నాశిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

రాజధాని అమరావతిని నిర్వీర్యం చేయటం తగదు

- 33 వేల ఎకరాలు త్యాగం చేస్తే ప్రతిఫలం అవమానాలా?
- 1480వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, జనవరి 5: రాజధాని అమరావతిని నిర్వీర్యం చేయటం తగదని 33 వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్, హైకోర్టు తీర్పును అమలుచేయాలంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1480వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ, రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన తమకు వైసీపీ ప్రభుత్వం అవమానాలు బహూకరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానులు అంటూ ప్రతి రోజు మానసికంగా కుంగదీస్తున్నారన్నారు. అవమానాలు భరించలేక 200మందికి పైగా రైతులు ప్రాణాలు విడిచారన్నారు. ప్రజా రాజధాని ఏర్పాటుచేస్తున్నామని ప్రభుత్వం అడిగితేనే భూములు ఇచ్చామన్నారు. చట్ట ప్రకారం ఒప్పందం కుదుర్చుకొని ల్యాండు పూలింగ్ స్కీం కింద ఇచ్చామన్నారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేయటమే ధ్యేయంగా పెట్టుకుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.9వేల కోట్ల అమరావతి అభివృద్ధి పనులు జరిగితే, నాలుగేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఇటుక కూడా పెట్టలేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గురజాలటౌన్, జనవరి 5: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని మాడుగులలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కంపసాటి వెంకటనరసయ్య (36) తన పొలంలో బోరు మరమ్మతులకు గురవడంతో గ్రామంలోని ప్రైవేట్ హెల్పర్ నలజాల శ్రీనుతో కలిసి పొలానికి చేరుకున్నారు. మరమ్మతులు పూర్తి చేసుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతూ వెంకటనరసయ్య హైడ్రాలిక్ పైపును కిందికి దింపే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటనరసయ్యను కాపాడేందుకు శ్రీను ప్రయత్నించగా అతనికి కూడా గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలి క్రైం, జనవరి 5: తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో కొలకలూరు రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెనాలి రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు కొలకలూరు స్టేషన్ సమీపంలో సుమారు 50-55 సంవత్సరాల వయసుగల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నది. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య

తెనాలి మారీసుపేట, జనవరి 5: ఉరివేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన సుల్తానాబాదులో జరిగిందని త్రీటౌన్ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం పట్టణంలోని సుల్తానాబాదుకు చెందిన కుంచాల హనుమంతరావు కుమార్తె కుంచాల స్వాతి(24) ఏం ఫార్మసీ చదువు పూర్తి చేసింది. తల్లిదండ్రులు వివాహ ప్రయత్నాలు చేస్తుండగా వివాహం చేసుకోవడం ఇష్టంలేక ఫ్యానుకు ఉరి వేసుకుని మృతిచెందిందని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

- ప్రముఖ Govt. బ్యాంకింగ్ సంస్థలోని ఏజెన్సీ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను (గుంటూరు, తెనాలి, బాపట్ల, నరసరావుపేట, సత్తెనపల్లి ఏరియా వారికి ప్రాధాన్యత) Ph : 90303 57576. SPA-4954
- గుంటూరు సిటీలోని మా ఆఫీస్ నందు పనిచేయుటకు Tally, Accounts, Excel లో అనుభవం కలిగిన వారు కావలెను. లేడీస్‌కి ప్రాముఖ్యము ఇవ్వబడును. Contact No : 91003 47592 AJG-166891
- గుంటూరులోని ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీలో ఆఫీసు మరియు సిస్టమ్ వర్క్ చేయుటకు ఇంటర్ ఉత్తీర్ణత కలిగిన వివాహిత మహిళలు కావలెను. సెల్ : 90309 93895 AJB-1290
- ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్లను / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం జీతం 20K ఫోన్:8977639662, 8977639663 AJH-13256

CHANGE OF NAME

- Valluru Tirupula vanisri D/o valluru Nagamalleswara Rao, R/o - D.No 2-24, Nutakki Village, Mangalagiri mandal, Guntur District - 522303, AP. have changed my name from Valluru Tirupula vanisri to Valluru Tripura Vanisri for all purposes. AJB-181713

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

అద్దెకు

- తెనాలి ఐతానగర్ రోడ్డులో గుప్తాకాలేజీ వద్ద ఏసీ విస్తీర్ణంలో నెలకొల్పబడిన మనోప్రకాష్ మానసిక చికిత్సలయం మొత్తంగా గాని / విడివిడిగా గాని అమ్మకము / అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 9440220551, 8500514024 AJG-152088

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

- బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999 AJB-181853

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	99639 84109
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

ఉద్యమాల పేరుతో ప్రజలను మోసం చేసిన ఆర్.కృష్ణయ్య

- టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు రాజ్యాధికారం
- ఎమ్మెల్యే అనగాని



రేపల్లె, జనవరి 5: ఉద్యమాల పేరుతో ఆర్.కృష్ణయ్య ప్రజలను మోసం చేసి వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగం సంపాదించుకున్నారే తప్ప బీసీ సోదరులకు ఒక్కరికైనా ఉద్యోగం ఇప్పించారా అని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 52 కార్పొరేషన్లు పెట్టారే తప్ప ఒక కార్యాలయం గాని, చైర్మన్‌లకు కుర్చీలు గాని ఏర్పాటుచేసిన పరిస్థితి లేదన్నారు. దొంగ కార్పొరేషన్ల పేరిట రూ.కోట్లల్లో రుణాల రూపేణా దోచుకుతిన్నది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు రాజ్యాధికారం కల్పించారన్నారు. బీసీలకు 34శాతం ఉన్న రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 24 శాతం చేసి 16వేల పోస్టులను లాగేసుకున్న వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 150 పథకాలు తెచ్చి బీసీలకు సముచిత స్థానం కల్పించామన్నారు. ఆర్.కృష్ణయ్య చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు బీసీలకు మాయమాటలు చెప్పిన జగన్‌కు రానున్న రోజుల్లో బీసీలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో అన్ని శాఖల ఉద్యోగులు రోడ్డెక్కిన పరిస్థితి చూస్తున్నామన్నారు. ఉపాధ్యాయులతో బాత్‌రూమ్‌లు కడిగించటం, అంగన్‌వాడీలు 25రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవటం, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు న్యాయమైన కోర్కెల సాధన కోసం నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం సిగ్గు చేటన్నారు. అబద్ధపు హామీలతో జగన్ ఒక్క ఛాన్స్ అని రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని, అభివృద్ధిలో 25 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కనుమూరి బాజీచౌదరిపై కక్షతోనే కేసు



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ, నాగోతు శౌరయ్య తదితరులు

సత్తెనపల్లి, జనవరి 5: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరిపై సత్తెనపల్లి డీఎస్పీ కక్ష సాధింపుతోనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నకరికల్లు మండలం కుంకలగుంటలో ఇటీవల అర్ధరాత్రి సమయంలో నలుగురు యువకులు సంచరిస్తుండగా గతంలో ఆ ప్రాంతంలో దొంగతనాలు జరిగి ఉండటంతో బాజీచౌదరి సమాచారాన్ని పోలీసులకు అందించి వారిని పట్టించారన్నారు. రాజకీయ ఒత్తిడుల నేపథ్యంలో బాజీచౌదరి కులం పేరుతో వారిని దూషించాడని తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. బాజీచౌదరికి 41 నోటీసులు ఇవ్వకుండా 2వ తేదీ అర్ధరాత్రి కుంకలగుంటలో బాజీచౌదరి ఇంటిపై డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు దాడిచేసి భయానక వాతావరణం సృష్టించారన్నారు. వెంటనే అతనిపై నమోదుచేసిన తప్పుడు కేసును ఉపసహరించుకోవాలని కన్నా డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దోపిడీ, అరాచకపాలనకు తెరతీశారని కన్నా అన్నారు. రాష్ట్రాన్ని గాలికి వదిలి వేశారన్నారు. దొంగల ముఠాలా సీఎం జగన్, అతని ఎమ్మెల్యేలు రాష్ట్రం మీదపడి దోచుకుతింటున్నారన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత, తిరుగుబాటును తట్టుకోలేక తన వైఫల్యాలను ఎమ్మెల్యేలపై నెట్టారన్నారు. రాష్ట్రంలో 75శాతం ప్రజావ్యతిరేకత ముఖ్యమంత్రిపై, 25శాతం ఎమ్మెల్యేల మీద ఉందన్నారు. ప్రజలు తిరస్కరించిన ఎమ్మెల్యేలు, మంత్రులను వేరే ప్రాంతాల్లో నియమిస్తే ప్రజలు అమాయకులు కారని తిప్పికొడతారన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా నిరుద్యోగ యువతతో జగన్ ఆటలాడుతున్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెపుతారని ఆయన హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య ఉన్నారు.

రోగులకు సక్రమంగా వైద్యసేవలందించాలి

రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి మంజుల



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో మందులను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి మంజుల

కొల్లిపర, జనవరి 5: రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి మంజుల అన్నారు. శుక్రవారం మండలంలోని హనుమాన్‌పాలెంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష పేజ్-2 కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. క్యాంపులో వివిధ వైద్యాధికారులు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మందులను పరిశీలించి అన్ని వ్యాధులకు సంబంధించిన మందులు రోగులందరికి తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.ప్రభుత్వం పేదప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించటం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వైద్యాధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో ఎ.శ్రావణ్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, మెడికల్ జిల్లా కో-ఆర్డినేటర్ శిరీష, ఎంపీడీవో విజయలక్ష్మి, మండల వైద్యాధికారి లక్ష్మిసుధ, పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకర్‌రావు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నంబూరులో రోడ్డుపై కూర్చొని నిరసన తెలుపుతున్న మైనార్టీలు

సర్వే చేయకుండా రోడ్డు ఎలా వేస్తారు?

- వైసీపీ నాయకుడి తీరుతో స్థానికుల నిరసన
- అడ్డుకున్న స్థానికులపై వైసీపీ నాయకుడి ఆగ్రహం
- బౌన్సర్లను తెచ్చి బెదిరించిన వైనం

పెదకాకాని, జనవరి 5: మా రోడ్డులో అన్నీ ఆక్రమణలు ఉన్నాయి... రోడ్డు సర్వే చేసి మార్కింగ్ వేసిన తర్వాతనే రోడ్డు పనులు ప్రారంభించాలని నంబూరుకు చెందిన మైనార్టీలు కోరారు. శుక్రవారం ఆ ప్రాంతంలో రోడ్డు వేసేందుకు వచ్చినవారిని స్థానికులు అడ్డుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన స్థానిక వైసీపీ మైనార్టీ నాయకుడు, ఎమ్మెల్యే రోశయ్య ప్రధాన అనుచరుడూ అయిన సదరు నేత తమ బలం చూపించేందుకు వెంటనే బౌన్సర్లను తెప్పించి స్థానికులపై దౌర్జన్యానికి దిగారు. దీన్ని తీవ్రంగా ప్రతిఘటించిన స్థానికులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో రోడ్డు వేయడం తాత్కాలికంగా నిలిపివేశారు.

రేపు ఉపకార వేతనాల పంపిణీ

- 300 మందికి రూ.50లక్షలు పంపిణీ
- కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బసవపున్నయ్య



మాట్లాడుతున్న డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య

గుంటూరు(విద్య), జనవరి 5: ప్రభుత్వ సహాయం పొందని ప్రతిభావంతులైన పేద సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులకు ఈనెల 7వ తేదీన కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య వెల్లడించారు. కేఎల్పీ స్కూల్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. 2003లో సంస్థ ఏర్పాటుచేసి అప్పటినుంచి ప్రతి సంవత్సరం ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. ఈనెల 7న కేఎల్పీ స్కూల్‌లో జరిగే కార్యక్రమంలో 300 మందికి రూ.50లక్షలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విశ్రాంత ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. సంస్థ నుంచి ఆర్థిక సహాయం అందుకుని జీవితంలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు చేయూత ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావు, వడ్లమూడి గోవర్ధనరావు, కేఎల్పీ స్కూల్ డీన్ నామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఓట్ల దొంగలపై అప్రమత్తంగా ఉండాలి

- టీడీపీ, జనసేన శ్రేణులు సమష్టిగా పనిచేయాలి
- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 5: టీడీపీ, జనసేన కార్యకర్తలంతా వైసీపీ ఓట్ల దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. రాష్ట్రంలో వైసీపీకి ఓటమి ఖాయమైన పరిస్థితుల్లో విపక్షాల ఓట్లు జాబితాలో గోల్‌మాల్ చేసేందుకు జగన్‌రెడ్డి ముఠా తెగించే అవకాశం ఉందని ఆయన అన్నారు. పట్టణంలోని 10, 11 వార్డుల పార్టీ నాయకులతో శుక్రవారం జరిగిన సమీక్షలో ప్రత్తిపాటి మాట్లాడారు. సొంత పార్టీ నేతలే బైబై జగన్ అంటూ పారిపోతున్న పరిస్థితుల్లో బ్లూ బ్యాచ్ విపక్షాల ఓట్లు తొలగించటం, దొంగ ఓట్లు చేర్పించటం, పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఈనెల 22న తుది ఓటర్ల జాబితా విడుదలకు ఈసీ సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఓటు జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాల గురించి, టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. అనేక మంది వైసీపీ నాయకులు టీడీపీలోకి రావటం శుభ పరిణామంగా ప్రత్తిపాటి అభివర్ణించారు.

నిరుద్యోగులను మోసం చేసిన ముఖ్యమంత్రి

మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

బెల్లంకొండ, జనవరి 5: అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తానని.. జనవరి 1న జాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్భాలు పలికి నిరుద్యోగులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలువునా మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ లేక, రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం లేక రాష్ట్ర భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రంలోని నిరుద్యోగుల్లో 73 శాతం పట్టభద్రులు ఉన్నారని తెలిపారు. నాలుగున్నర సంవత్సరాల వైసీపీ పాలనలో యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంలో 15 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుడితే జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని నిర్వీర్యం చేశారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండుసార్లు డీఎస్సీ నిర్వహించి 18వేల ఉద్యోగాలు ఇచ్చామని సూచించారు. ప్రతి ఏటా మెగా డీఎస్సీ అన్న జగన్ ఒక్క టీచర్ ఉద్యోగం భర్తీ చేయలేదని వివరించారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ పనుల్లో కాంట్రాక్టులు ఇస్తామన్న సీఎం ఎంతమందికి ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనలో గంజాయి అక్రమ రవాణాలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, టీడీపీ నేతలు పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, లక్ష్మీనారాయణ, సలాం, గుంజా గంగారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్వారీలో విజిలెన్స్ అధికారుల విచారణ

చేబ్రోలు, జనవరి 5: చేబ్రోలు క్వారీలో, జగన్న కాలనీలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. చేబ్రోలులో ఓ వైసీపీ నాయకుడు జగన్న కాలనీకి మెరక వేస్తున్నానని గ్రావెల్ క్వారీని తవ్వారు. 25 అడుగులపైగా మైనింగ్ చేసి గ్రావెల్‌ను వివిధ ప్రాంతాలో పెద్దఎత్తున విక్రయించిన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై ఓ వైసీపీ నాయకుడే విజిలెన్స్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ఫిర్యాదు ఆధారంగా శుక్రవారం చేబ్రోలు వచ్చిన విజిలెన్స్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, మైనింగ్ అధికారులు గ్రావెల్ క్వారీ వద్దకు వెళ్లి మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే చేబ్రోలు జగనన్న కాలనీకి వెళ్లి సదరు మట్టిని తోలిన విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు గృహాల లబ్ధిదారులు తమకు ఆ మైనింగ్ చేసిన నాయకుడు గ్రావెల్ తోలలేదని అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. అయితే విజిలెన్స్ అధికారుల విచారణను గోప్యంగా ఉంచటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

13న తెలుగు రాష్ట్రాల స్థాయి పాటల పోటీలు

మాచర్ల, జనవరి 5: లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా గాయనీ గాయకులను ప్రోత్సహించేందుకు 'మనము పాడుదాం' అనే సినిమా పాటల పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 13వ తేదీన పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో పోటీలు జరగనున్నాయి. ఆసక్తిగల వారు 13వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే ప్రిల్యూట్నీకి హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అదే రోజు సాయంత్రం 6 గంటలకు తుది పోటీ జరపుతామన్నారు. వయోభేదం, ఎంట్రీ ఫీజు లేదని, భోజన సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. లయన్స్ జిల్లా సాంస్కృతిక శాఖాధ్యక్షుడు డాక్టర్ కమలాసనరావు ఆధ్వర్యాన జరిగే ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు. సమాచారం కోసం సెల్: 94410 65681ను సంప్రదించాలని కోరారు.

అక్రమ మద్యం, నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు

- 104 కేసులలో 107మంది నిందితుల అరెస్ట్
- రూ.2,65,780 విలువ చేసే మద్యం సీజ్



బాపట్ల సెబ్ సీఐ ఎస్.శ్రీనివాసు, పోలీసులు, ధ్వంసం చేసిన బెల్లం ఊట డ్రమ్‌లు

బాపట్ల, జనవరి 5: జిల్లాలోని అక్రమ మద్యం, నాటుసారా తయారీ కేంద్రాలపై ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అధికారులు శుక్రవారం విస్తృత దాడులు చేశారు. జిల్లా వ్యాప్తంగా గత 10 రోజులుగా 104 కేసులలో 107మంది నిందితులను అరెస్ట్ చేసి రూ.2,65,780 విలువైన మద్యం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అక్రమ మద్యం, నాటుసారా క్రయ, విక్రయాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యానికి సంబంధించి మొత్తం 80 కేసులలో 83మంది నిందితులను అరెస్ట్ చేసి రూ.1,86,478 విలువైన మద్యాన్ని సీజ్ చేశామన్నారు. సెబ్ అధికారులు 24 కేసులలో 25మంది నిందితులను అరెస్ట్ చేసి రూ.79,302 విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, నిల్వ చేసిన స్థావరాలపై మెరుపుదాడులు నిర్వహించి మొత్తం 26 కేసులలో 38.25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని 5,640 లీటర్లు బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో రైల్వేస్టేషన్ రోడ్డులో నాటుసారా కలిగివున్న మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద ఉన్న 3 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నారని అమర్తలూరు పోలీసుస్టేషన్ పరిధిలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద 11 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారని అన్నారు. యద్దనపూడి పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద 8 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. తరుచుగా పోలీసు అధికారులు, సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహిస్తూ అనుమానిత ప్రాంతాలలో సోదాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలు అక్రమ మద్యం, గంజాయి, నాటుసారా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఎస్పీ హెల్ప్‌లైన్ 83338 13228 నెంబరుకు లేదా డయల్ 100, 112కు కాల్ చేసి సమాచార అందజేస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

స్టూవర్టుపురంలో...

బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామంలో సెబ్ సీఐ ఎస్.శ్రీనివాసు సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. కుందేరువాగు పక్కనే పోరంబోకులో నాటుసారా తయారీ చేస్తున్నట్లు గుర్తించి డ్రమ్‌లను వెలికితీసి 700 లీటర్లు బెల్లంఊటను ధ్వంసం చేశారు. అదేవిధంగా మండలంలోని బసివిరెడ్డిపాలెంలో అక్రమ మద్యం విక్రయ కేంద్రంపై దాడి చేసి 16 మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. దాడి నిర్వహించిన వారిలో ఎస్సై ప్రభుదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతికి మరిన్ని ప్రత్యేక రైళ్లు



గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సెలవుల రద్దీకి అనుగుణంగా రైల్వేశాఖ మరిన్ని ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు పేర్కొన్నది. నెం.07025 సికింద్రాబాద్ - బరంపురం రైలు ఈ నెల 12, 19 తేదీల్లో రాత్రి 7.45కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 11.15కి బరంపురం చేరుకొంటుంది. నెం.07026 బరంపురం - సికింద్రాబాద్ రైలు ఈ నెల 13, 20 తేదీల్లో మధ్యాహ్నం 12.30కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా మరుసటి రోజు ఉదయం 6.30కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నెం.07253 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ రైలు ఈ నెల 16న సాయంత్రం 5.10కి బయలుదేరి రాత్రి 10.40కి గుంటూరుకు వచ్చి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు వేకువజామున 5.20కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నెం.07254 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 17న సాయంత్రం 6.05కి బయలుదేరి రాత్రి 10.45కి గుంటూరు, మరుసటి రోజు వేకువజామున 5.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నెం.07023 హైదరాబాద్ - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 12న సాయంత్రం 6.30కి బయలుదేరి పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 7.10కి కాకినాడటౌన్‌కు చేరుకొంటుంది. నెం.07024 కాకినాడ టౌన్ - హైదరాబాద్ రైలు ఈ నెల 13న రాత్రి 10 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 8.30కి హైదరాబాద్ చేరుకొంటుంది. అలానే ఈ నెల 10న నెం.07066 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్, 11న కాకినాడటౌన్ - సికింద్రాబాద్, 12న నెం.07250 సికింద్రాబాద్ - కాకినాడటౌన్ రైళ్లు కూడా గుంటూరు, సత్తెనపల్లి మీదగా ప్రయాణిస్తాయని డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవం వాయిదా

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బిజీగా ఉండటంతో శనివారం గుంటూరు వరకు పొడిగించనున్న విశాఖపట్టణం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా పడింది. తిరిగి ఈ నెల 9వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉన్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి.

నేటి సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

సాంకేతిక కారణాల వలన శనివారం ఈ నెల 6వ తేదీ గుంటూరు నుంచి విశాఖపట్టణానికి బయలుదేరాల్సిన నెం.17239 సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేసినట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

బీరువాలోని 34 సవర్ల బంగారం చోరీ

- రూ. 55 వేల నగదు అపహరణ

దాచేపల్లి, జనవరి 5: కుటుంబసభ్యులంతా ఇంట్లో నిద్రిస్తు న్నారు.. బీరువా తాళం వేసింది వేసినట్లే వుంది.. బీరువాలో దాచిన 34 సవర్ల బంగారం, రూ.55వేల నగదు చోరీకి గురయ్యాయి. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు శుక్రవారం తెలిపిన వివరాలిలా వున్నాయి. దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామానికి చెందిన యర్రగడ్డ సైదులు ఇంట్లోని బీరువాలో 34 సవర్ల బంగారాన్ని, దేవుడి రూములో మరో రూ.55వేల డబ్బులు వుంచాడు. బ్యాంక్‌లో గోల్డ్ లోన్ తీసుకునేందుకు గాను బీరువాలో బంగారాన్ని దాచి వుంచాడు. తెల్లవారుజామున లేచి చూసే సరికి బీరువా తెరిచివుండటాన్ని గమనించి ఆందోళనకు గురయ్యారు. బీరువాను పరిశీలిం చి చూడగా గురువారం రాత్రి బీరువాలో దాచిన బంగారం మూట కనపడకుండా పో యింది. దేవుడి రూములో దాచిన రూ.55వేల నగదు కూడా మాయమైంది. సమాచారం అందుకున్న క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. డాగ్ ఇంట్లోనే చాలాసేపు తచ్చాడినట్లుగా తెలుస్తోంది. సైదులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96, 104, 115
చికెన్ విత్ స్కిన్	186.00
చికెన్ స్కిన్ లెస్	196.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



మహిళకు చీర, సంచి, కరపత్రాలు పంపిణీ చేస్తున్న నరేంద్రవర్మ తదితరులు

వైసీపీ ప్రభుత్వంపై మొదలైన తిరుగుబాటు : వేగేశన

బాపట్ల, జనవరి 5 : వైసీపీ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని మురుకుండపాడు గ్రామంలో శుక్రవారం ఇంటింటికి తెలుగుదేశం మీమాటే-నా బాట, భవిష్యత్తుకు గ్యారెంటి కార్యక్రమాలను పార్టీశ్రేణులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ మహిళలకు చీరలు, సంచులు అందజేసి భవిష్యత్తుకు గ్యారెంటీ సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ మురుకుండపాడులో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. ఇటీవల గ్రామంలో విషజ్వరాలు వచ్చి ప్రజలు ఇబ్బందిపడినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షులు కావూరి శ్రీనివాసరెడ్డి, తెలుగు రైతు అధ్యక్షులు నక్కల వీరరాఘవయ్య, పార్టీ మండల కార్యదర్శి సాంబశివరావు, మాజీ సర్పంచ్ పులిపాటి డేవిడ్, చెన్నుపాటి కిషోర్, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, మహిళా నాయకులు ఝాన్సీరాణి, షేక్ నజ్మా, దగ్గుమల్లి రాణి, వేమవరపు సుజాత, పల్లం జీవన్, కిషోర్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఫౌండేషన్ ప్రారంభం

కర్లపాలెం, జనవరి 5 : కర్లపాలెం పంచాయతీ ఎం.వి.రాజుపాలెం షాదీఖానాలో శుక్రవారం అబ్దుల్ కలాం ఫౌండేషన్‌ను టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించి తమవంతుగా ప్రతినెల రూ.2 వేలు 5 సంవత్సరాలపాటు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని అహ్మద్‌పఠాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పేదలకు దుప్పట్లను ఫౌండేషన్ సభ్యులతో కలిసి నరేంద్రవర్మ పంపిణీ చేశారు. వేగేశన నరేంద్రవర్మ, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీటీసీ బాజి, టీడీపీ నాయకులను ట్రస్ట్ సభ్యులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కర్లపాలెం ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు వై.భూపతిరావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీటీసీ షేక్ బాజి, దాసు, కాలేషా, గౌస్, హబీబ్ పాల్గొన్నారు.

మహిళలందరినీ లక్షాధికారులు చేయాలి : డీఆర్‌డీఏ పీడీ

కర్లపాలెం, జనవరి 5 : మహిళలందరిని లక్షాధికారి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ కృష్ణ అన్నారు. కర్లపాలెంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సెర్ప్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ల్యాక్‌పతిదివి కార్యక్రమంలో ఆయన శుక్రవారం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి ఎర్రకోట ప్రసంగంలో 2కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా చేస్తామని ప్రకటించారన్నారు. అందులోభాగంగా ప్రతి కుటుంబం సంవత్సరానికి రూ.లక్షపైన మిగులు ఆదాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.శ్రీనివాసులరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి, జిల్లా సోషల్ సెక్యూరిటి ఏపీఎం రాజారావు, జిల్లా స్త్రీనిధి ఏటీఎం కె.నాగబాబు, స్త్రీనిధి మేనేజర్, కామేశ్వరి, సీసీలు లక్ష్మీ, సోమేశ్వరి, శివకోటేశ్వరరావు, పూర్ణచంద్రరావు, అకౌంటెంట్ లక్ష్మీ, వీవోఏ పాల్గొన్నారు

టైటలింగ్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేయాలి

రేపల్లె, జనవరి 5 : టైటలింగ్ యాక్ట్ 27/22 చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని రేపల్లె బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది దారం సాంబశివరావు అన్నారు. శుక్రవారం రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 9వరోజుకు చేరాయి. ఈదీక్షల్లో న్యాయవాదులు ఆళ్ళ సూరిబాబు, డి. ఉదయ్‌,శంకర్, కేసన జగదీష్, యడ్ల గోపిరాజు, దీపాల ప్రసాద్‌లు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు, న్యాయవాదులు పాల్గొన్నారు. దీక్షకు జైభీమ్ భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు దోవ రమేష్‌రాంజీ సంఘీభావం తెలిపారు.

దస్తావేజు పోయినది

బాపట్ల జిల్లా, నగరం మండలం, నగరం గ్రామ కాపురస్తురాలు **కాగిత జాన్ విల్సన్ బాబు** గారి భార్య **ఆనందకుమారి** అను నేను ది.**29-12-2023**వ తేదీన డ.నెం. **309/2009** రుగా విక్రయ ఒరిజినల్ దస్తావేజును మరియు దీనికి సంబంధించిన లింక్ డ.నెం.**1204/2003** రుగా ఒరిజినల్ దస్తావేజును తీసుకొని జిరాక్స్ కొరకు నగరం నుండి సజ్జావారిపాలెం ఆటో లో వెళ్లుచుండగా మార్గ మధ్యలో పోయినది. దొరికినవారు ఈ క్రింది మొబైల్ నెం. **9441453481** సంప్రదించండి.

జగనన్న కాలనీలో దొంగల హల్‌చల్

బాపట్ల, జనవరి 5 : పట్టణంలోని ప్యాడిసన్‌పేట జగనన్నకాలనీవాసులను దొంగలు హడలెత్తిస్తున్నారు. గురువారం రాత్రి ఓ ఇంటి తాళాలు పగలగొట్టి లోపల ఉన్న ఏసీతోపాటు ఇతర వస్తువులు అపహరించారు. పోలీసులు రాత్రి గస్తీ ఏర్పాటు చేయాలని ఆప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి మజుందార్
- నేటి నుంచి 24 గంటల రిలే నిరాహారదీక్షలు



బాపట్ల ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రోడ్డుపై ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

బాపట్ల, జనవరి 5 : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టిన సమ్మె కొనసాగుతూనే ఉంది. 5వ తేదీ లోపు ఆందోళన విరమించి విధులలో చేరకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్డర్ జారీ చేసినా ఏమాత్రం భయపడకుండా ఆందోళన చేస్తూనే ఉన్నారు. శుక్రవారం బాపట్ల ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ బైఠాయించి నినాదాలు చేశారు. శనివారం నుంచి 24 గంటల రిలేనిరాహారదీక్షలు చేయనున్నట్లు ప్రకటించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కన్న ఎక్కువ వేతనం ఇస్తామని పాదయాత్రలో చెప్పిన హామీని అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు సీతామహాలక్ష్మీ, వసంత, ఎం.విజయభారతి, హేమమాలిని, గీత, వై.పార్వతిపాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జనవరి 5 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఉరితాళ్ళు బిగించుకున్నారు. సీఐటీయు మండల కార్యదర్శి జి. సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పట్ల మొండి వైఖరి అవలంభిస్తుందన్నారు. ఆయా ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, శ్రీమన్నారాయణలు అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షురాలు బి. రమాదేవి, సెక్టార్ లీడర్లు గృహలక్ష్మీ, సూర్యలక్ష్మీ, భద్రకాళీ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, జనవరి 5 : ఇప్పటి వరకు అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లలేదంటే ఆయన రాష్ట్రంలో ఉన్నాడా.. అడవిలో అడవి మనిషిలాగా ఉన్నాడా అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె 25వ రోజు కొనసాగింది. దిష్టిబొమ్మకు ఆకులు చుట్టి అడవి మనిషి రూపంలో తయారు చేసి జగన్ చిత్రపటాన్ని అతికించి తమ న్యాయమైన డిమాండ్ల వినతిపత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అమృతలూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు కామేశ్వరి, సీఐటీయూ నాయకులు బి.సుబ్బారావు, కార్యకర్తలు ఆదిలక్ష్మి, వనజ, భాగ్యం, సౌభాగ్యలక్ష్మి, బాల, అపర్ణ, అరుణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, జనవరి 5 : వేమూరులో అంగన్‌వాడీలు తమ కోర్కెల సాధన కోసంగా ప్రారంభించిన నిరవధిక సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తపరిచారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరశిస్తూ నినాదాలు చేశారు. సిఐటియు నాయకులు సుధాకర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు 25రోజుల నుండి కనీస వేతనం గ్రాడ్యూటీ కోసంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 24గంటల నిరాహార దీక్షలకు సంఘం పిలుపునిచ్చిందన్నారు. సమావేశంలో సిఐటియు నాయకులు అగస్టీన్, యూనియన్ నాయకులు బసవమ్మ, పద్మావతి, అన్నపూర్ణ, రెబ్బమ్మ, సరోజినీ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, జనవరి 5 : అంగన్‌వాడీ కార్యకర్తలు తమ డిమాండ్లను పరిష్కరించాలని 25 రోజులుగా దీక్షలు చేస్తుంటే దీక్ష విరమించి విధులలో చే రకుంటే ఉద్యోగాల నుండి తొలగిస్తామని నోటీసులు ఇవ్వడం దారుణమని సీపీఎం నాయకులు మణిలాల్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చేస్తున్న దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ యూనియన్ నాయకులు మల్లేశ్వరి, సంతోష్‌కుమారి, శిరీష, మంగాదేవి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, జనవరి 5 : ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపులకు పాల్పడటం సరైన పద్ధతి కాదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు జీ.నాగమల్లేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం రేపల్లె తాలూకా ప్రధాన కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె 25వరోజుకు చేరింది. సైకిల్ రిక్షాలు తొక్కి నిరసన తెలిపి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కనకదుర్గ, త్రివేణి, భువనశ్రీ, భారతి, మోక్షశ్రీ, బి.సమాధానం, భాగ్యమ్మ, మార్తమ్మ, ఏఐటీయూసీ నాయకులు నాగాంజనేయులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే అంగన్‌వాడీలు, సీఐటీయూ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 25వరోజుకు చేరాయి. బుర్రకథలు చెప్పి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు యూటీఎఫ్ రేపల్లె కమిటీ, ఎస్ఎఫ్ఐ కమిటీలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, డి.జ్యోతి, వై.మేరీమణి, విజయలక్ష్మి, నిర్మలాజ్యోతి, రజని తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో రిక్షాలు తొక్కుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నాడు-నేడు నిధులను సక్రమంగా వినియోగించాలి

చెరుకుపల్లి, జనవరి 5 : ప్రభుత్వం పాఠశాలలో అభివృద్ధికి నాడు-నేడు ద్వారా అందించిన నిధులను సక్రమంగా వినియోగించి పాఠశాలలను అభివృద్ధి చేయాలని డీఈవో పి.వి.జే.రామారావు అన్నారు. గుళ్ళపల్లి జడ్పీహెచ్‌సీలో చెరుకుపల్లి, రేపల్లె, నగరం, భట్టిప్రోలు, నిజాంపట్నం, పిట్టలవారిపాలెం, కర్లపాలెం మండలాల ప్రధానోపాధ్యాయుల దీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులు 10వతరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించి ఫలితాలలో జిల్లాలో అగ్రగామిగా నిలవాలని చెప్పారు. సమావేశంలో ఎఎస్‌వో సంజయ్ ఎపివో శ్రీనివాస్‌రెడ్డి, ఎఎంకుపోయోజన్, సిఎంవో శ్రీనివాసరెడ్డి, ఎంఈవోలు, పి.లాజర్, నవీన్‌కుమార్, వివిధ మండలాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు పాల్గొన్నారు.

టీడీపీ మండల నూతన కార్యవర్గం ఎంపిక

చుండూరు, జనవరి 5 : తెలుగుదేశం పార్టీ మండల నూతన కార్యవర్గం, వివిధ విభాగాల అధ్యక్షులను శుక్రవారం మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు ప్రకటించారు. మండల తెలుగుదేశం అధ్యక్షులుగా గుమ్మడి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా దేవరపల్లి అనీల్‌కుమార్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా సయ్యద్ బాషీద్ ఎంపికైనట్లు ప్రకటించారు. అదేవిధంగా యడ్లపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడిగా అలపర్తి శ్రీనివాసరావు, మరో 9 మంది కమిటీ సభ్యులను నియమించారు. వేటపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడిగా రాయపాటి శ్రీనివాసరావు, మరో తొమ్మిది సభ్యులతో కూడిన గ్రామ కమిటీని ఆనందబాబు ప్రకటించారు.

ఆంధ్రజ్యోతి

దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

సంప్రదించండి 99854 11227 99854 02292



ల్యాబ్ కిషోర్, గౌస్‌ఫీర్‌కు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్

ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తాం : అనగాని

రేపల్లె, జనవరి 5 : టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు ల్యాబ్ కిషోర్, ఎస్‌కే గౌస్‌ఫీర్, ఎస్‌కే కరిముల్లా, చెన్ను బాలకృష్ణ, ఎస్‌కే యాసిన్, అంకే మర్రికృష్ణ, కె.శ్రీనివాసరావు, అబినై, షంషేర్ బేగ్, వైసీపీ నాయకులకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ టీడీపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో టీడీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ప్రతి కార్యకర్త అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాతా ఏడుకొండలు, డొక్కు బుజ్జి, నర్రా సుబ్బయ్య, కేసన రామకృష్ణ, డొక్కు వెంకటేశ్వరరావు, షేక్ ముబీన్, యార్లగడ్డ చిన్నబాబు, దేవగిరి రవి, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, కొలసాని రాము, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్‌లను ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. టీడీపీ నాయకులకు క్యాలెండర్‌లను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుర్రం మురహరిరావు, ఆలపాటి వేణు, కేసన రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పేరుకుపోతున్న చెత్త



పట్టణంలో నివాస గృహాల మధ్య ఉన్న చెత్తా, చెదారం

బాపట్లటౌన్, జనవరి 5 : మున్సిపాలిటిలో కాంట్రాక్ట్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల కార్మికుల సమ్మెబాటతో చెత్తాచెదారం పేరుకుపోతుంది. సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు తోడు కావటంతో శుక్రవారం పారిశుధ్య కార్మికులు సమ్మెను మరింత ఉధృతం చేశారు. పట్టణంలో సుమారు 10మంది శాశ్విత, 160మంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఎక్కువమంది ఉన్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగాల సిబ్బంది నాలుగురోజులుగా సమ్మెలోకి వెళ్ళగా వీరు చేసే పారిశుధ్య పనులు నిలిచిపోవటంతో పట్టణంలో చెత్తాచెదారం మరింతగా పేరుకుపోయింది. డ్రెయిన్లలో మురుగు తొలిగించకపోవటంతో దోమలు ఉధృతమవుతున్నాయి. మున్సిపల్ అధికారులు చెత్త సేకరణకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● రేపల్లె, జనవరి 5 : కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పోటీ కార్మికులను తీసుకువచ్చి పనులు చేయించటం సిగ్గుచేటు అని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె శుక్రవారం 3వరోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ కార్మికులపై బైండోవర్‌ను నమోదు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎ.సుధాకర్, సురేష్, టి.కుమారి, ఎన్.నాంచారమ్మ, కె.సామ్రాజ్యం, బి.రాజేశ్వరి, దుర్గారావు, కోటేశ్వరమ్మ, శివశంకర్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చేసే పారిశుధ్య కార్మికుల సమ్మెకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ న్యాయమైన సమస్యలపై హామీనిచ్చి కూడా పరిష్కరించకపోవటం వైసీపీ ప్రభుత్వానికే చెల్లిందన్నారు.

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి : కలెక్టర్



నోడల్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, జనవరి 5 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను నిర్వహించటానికి సిద్ధంగా ఉండాలని నోడల్ ఆఫీసర్లను కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్నికల ప్రక్రియపై నోడల్ అధికారులతో సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించటానికి అవసరమైన పోలీసుసిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఆర్‌అండ్‌బి ఎస్ఈ శ్రీనివాస్, గనులశాఖ ఏడీ రాజేష్‌కుమార్, డీఎఫ్‌వో మాదవనాయుడు, మత్స్యశాఖ ఏడీ సైదా, ఏపీఎం ఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి

బాపట్ల, జనవరి 5 : విజయవాడ ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన బస్సు ప్రమాద దుర్ఘటనలో జిల్లాలో ఇద్దరు మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.20 లక్షల నగదు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. చీరాలకు చెందిన మౌటాని కుమారి మృతి చెందగా ఆమె కుమారుడు కిషోర్‌బాబుకు రూ.10 లక్షలు అందించారు. అదేవిధంగా జె.పంగులూరు మండలానికి చెందిన కాటి అహను అలియాస్ చెర్రీ మృతి చెందగా తల్లి ఝాన్సీరాణికి రూ.10 లక్షల చెక్కును శుక్రవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషా అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కె.గోపికృష్ణ పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధి : కలెక్టర్

బాపట్ల, జనవరి 5 : నవరత్నాలు సంక్షేమ పథకాలకు అర్హత ఉండి లబ్ధి పొందలేని వారందరికి ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. నవరత్నాలు ద్వైవార్షిక మంజూరు కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,050 మందికి 3.01 కోట్ల నగదు విడుదలైందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ, డీఎల్‌డీవో సువార్త, డీఆర్‌డీఏ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కు అందజేశారు.

కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరటాన్ని స్వాగతిస్తున్నాం

- బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోపి

వేమూరు, జనవరి 5 : దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మనస్ఫూర్తిగా పార్టీలోకి స్వాగతిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు యార్లగడ్డ గోపి అన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ షర్మిల రాకతో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేమూరు మండల యువజన నాయకులు దాసరి నాగబాబు, యార్లగడ్డ రాజేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

భట్టిప్రోలు, జనవరి 5 : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటు టీకాలు వేస్తున్నందున పశుపోషకులు తమ పశువులకు టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు కోరారు. ఈనెల 2వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా 4 నెలల వయస్సు దాటిన ప్రతి దూడకు, పశువులకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె సహాయ సంచాలకులు నరేంద్రబాబు, అడిషనల్ ఏడీ డాక్టర్ శ్రీలక్ష్మీ, భట్టిప్రోలు పశువైద్యాధికారిణి రంజిత తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ లోపంతో నిలిచిపోయిన రైలు

బాపట్ల, జనవరి 5 : బాపట్ల రైల్వేస్టేషన్‌లో శుక్రవారం సిగ్నల్ లోపం కారణంగా రైలు గంటసేపు నిలిచిపోయింది. సాంకేతిక సమస్యను గుర్తించిన రైల్వే అధికారులు సరిచేసిన తర్వాత రైలు పునరుద్ధరించారు. దీనివల్ల ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.



అవనిపై హరివిల్లు

- సప్తవర్ణ శోభితంగా సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం
- ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన
- 180 మంది మహిళల హాజరు
- విజేతలకు బహుమతులు అందజేసిన డీఎస్పీ ప్రసాదరావు



లోగో వేస్తున్న విద్యార్థినులు

చీరాల, జనవరి 5: ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగుళూరు... రియల్ పార్టనర్ స్వర్గ సీమ సుకేతన వారు సంయుక్తంగా సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సౌజన్యంతో శుక్రవారం సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్)లో నిర్వహించిన ముత్యాల ముగ్గులు పోటీలకు విశేష స్పందన లభించింది. పోటీలలో గెలుపొందిన విజేతలకు డీఎస్పీ ప్రసాదరావు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు ప్రధానంగా విద్యార్థినులకు దిశ యాప్ వినియోగ ఆవశ్యకతను వివరించారు. సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడే విధంగా పోటీలు నిర్వహించినతీరు ప్రశంసనీయమన్నారు. ఆంధ్రజ్యోతి ప్రతినిధులు ఆళ్ల శ్రీనివాసరావు, సూర్యదేవర నవీన్‌బాబు మాట్లాడుతూ ఆనవాయితీగా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.


ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న సెయింట్‌ఆన్స్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, అక్రిడేషన్స్ మేనేజర్ డాక్టర్ సుబ్బారావు తదితరులు


మొదటి బహుమతి పొందిన ముగ్గును చూస్తున్న కళాశాల, ఆంధ్రజ్యోతి ప్రతినిధులు

ఉదయం 8.30 గంటల నుంచి వివిధ ప్రాంతాల నుంచి పోటీలకు వచ్చేవారి కోసం కళాశాల వారు బస్సులను ఏర్పాటుచేశారు. పోటీలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 180 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా పోటీలను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, అక్రిడేషన్స్ కమిటీ మేనేజర్ డాక్టర్ సి. సుబ్బారావు ప్రారంభించారు. పోటీల అనంతరం పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన వారి తిరుగుప్రయాణంకు బస్సు సౌకర్యం ఏర్పాటుచేశారు. ఎక్కడ ఎవరికి అసౌకర్యం కలగకుండా కళాశాల ఈవెంట్ టీం తగిన ఏర్పాట్లుచేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై అరుణజ్యోతి, ఆంధ్రజ్యోతి చీరాల వీసీ పరిధిలోని పలువురు విలేఖరులు, యాడ్స్ బాధ్యులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు


పోటీలకు విచ్చేసిన విద్యార్థినులు, మహిళలు

వంటావార్పుతో కార్మికుల నిరసన


అద్దంకిలో వంటావార్పుతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అద్దంకిటౌన్, జనవరి 5: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా శిబిరంలో కార్మికులు వంటావార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాం, బత్తుల కృష్ణ, గాలి బీష్మా, మాలెపోగు అంజమ్మ, దాసరి అలివేలు, దాసరి వీరయ్య, యర్రమోతు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చీరాల: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె, నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న నిరసన శిబిరం వద్ద వంటావార్పుతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ ప్రతినిధులు కార్మికులకు మద్దతుగా పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

యద్దనపూడి (మార్టూరు), జనవరి 5: యద్దనపూడి మండలం పెదజాగర్లమూడి గ్రామంలో 23వ నంబరు రేషను షాపుపై బాపట్ల సివిల్ సప్లయ్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. అదనంగా ఉన్న 15 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషను డీలర్, ఎండీయూ వాహన డ్రైవలపై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ ఓంకార్ తెలిపారు. స్వాధీ నం చేసుకున్న బియ్యాన్ని తమ కస్టడీలో ఉంచుకున్నట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు తెలిపారు. ఈ తనిఖీలలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అబ్రహం, కిషోర్, ఆర్‌ఐ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు రుణాలిచ్చి ఆదుకుంటాం!

బల్లికురవ, జనవరి 5: గ్రామాలలో నిరుపేదలను పేదరికం నుంచి విముక్తి కల్పించేలా పలు రకాల రుణాలను అందించే చర్యలు చేపడుతున్నట్లు చీరాల ఏపీఎం గద్దె సుబ్బారావు తెలిపారు. శుక్రవారం బల్లికురవ వైఎస్‌ఆర్ ఇందిరా క్రాంతి పథం కార్యాలయంలో లక్‌పతి దీది కార్యక్రమంలో గ్రామైక్య సంఘాల వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా శిక్షకులు సుబ్బారావు మాట్లాడుతూ గ్రామాలో ఉన్న నిరుపేదలను గుర్తించాలన్నారు. త్వరలో క్లస్టర్ల వారీగా గుర్తించి బ్యాంకు రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏపీఎం సురేంద్రబాబు, సీసీలు పాల్గొన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలను తనిఖీ చేసిన మైనింగ్ అధికారులు

బల్లికురవ, జనవరి 5: బిల్లులు లేకుండా అక్రమ మార్గంలో గ్రానైట్ స్లాబులు తరలించకుండా మైనింగ్ అధికారులు శుక్రవారం పలు గ్రానైట్ ఫ్యాక్టరీలను తనిఖీ చేశారు. బల్లికురవ మండల కేంద్రంలో ఉన్న పలు ఫ్యాక్టరీలలో ఉన్న నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏడీ ఆదేశాల మేరకు ఫ్యాక్టరీలను తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ తనిఖీలలో మైనింగ్ శాఖ ఆర్‌ఐ రాజు, టీఏ భాస్కర్ పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా కల్పించేందుకే రూ.3 వేల పెన్షన్: బలరాం


పెన్షన్ల పంపిణీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, జనవరి 5: అవసరార్థులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అర్హులైన ప్రతి ఒక్కరికి నెలకు రూ.3వేలు పెన్షన్‌గా సీఎం జగన్ ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఎస్‌ఆర్ అండ్ వీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపెటీలో శుక్రవారం నిర్వహించిన పెన్షన్లు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే బలరాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న చేయూత చరిత్రాత్మకమన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ఆధారంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకా లు అందిస్తున్నట్టు చెప్పారు. ఆ చేయూతను లబ్ధిదారులు సద్వినియోగం చేసు కోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజిని, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


పంపిణీకి సిద్ధంగా ఉంచిన నిత్యావసర సరుకులు

చీరాల, జనవరి 5: ఇటీవల సంభవించిన తుఫాన్ నేపథ్యంలో బాధితులకు మార్పు సేవా సంస్థ ప్రతినిధులు శుక్రవారం మండల పరిధిలోని వాడరేవు తీర ప్రాంతవాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పాకల, ఎస్సీ కాలనీ, సునామీ కాలనీ, బెస్తకాలనీలలో సుమారు 700 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1500 విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మార్పు గ్రెగోరి, సుశీల్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌లు మాట్లాడుతూ సంస్థ పరంగా అందిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అంతకు ముందు సంస్థ బాధ్యులు, స్థానికులతో కలసి తీరాన్ని, వారి నివాసాలన పరిసరాలను శ్రమదానంతో శుభ్రపరిచారు. ఆరోగ్య పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఎరిపిల్లి రమణ, చూగూడి సురేష్, మచ్చా సువార్త, మార్పు విన్సెంట్ పాల్, జోతుల ప్రకాష్, చేగూడి జాన్సన్ మార్పు వంశీ, పారా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తించాలి

బల్లికురవ, జనవరి 5: గ్రామాలలో ఈనెల 12లోగా ఇంటింటికి తిరిగి కు ష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి నివేదిక ఇవ్వాలని గుంటుపల్లి పీ హెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ కోరారు. శుక్రవారం స్థానిక పీహెచ్ సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో కుష్టు వ్యాధిగ్రస్థుల సర్వేపై చర్చించారు. అనంతరం వైద్య సిబ్బందితో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు రంగం సిద్ధం

- ‘ఆడుదాం ఆంధ్ర పేరు’తో చదును
- స్వాధీనానికి అధికార పార్టీ నేతల యత్నాలు
- బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.4 కోట్ల పైమాటే!

అద్దంకి, జనవరి 5: ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణ సాకుతో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు అధికార పార్టీ నేతలు రంగం సిద్ధం చేసుకున్నారు. శింగరకొండ వద్ద నామ్ రోడ్డుకు అత్యంత సమీపంలో కలవకూరు, గోపాలపురం రెవెన్యూల సరిహద్దులో శింగరకొండపాలెం పంచాయతీ పరిధిలో సుమారు ఎకరా ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు సిద్ధం అయ్యారు.

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు అద్దంకి వచ్చిన సమయంలో శింగరకొండ వద్ద హెలీప్యాడ్ నిర్మాణం చేశారు. ఆప్రాంతంలో ప్రభుత్వ భూమి ఉంది. ఈక్రమంలో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు నిర్వహణకు కొంతమేర ప్రభుత్వ భూమిని చదును చేశారు. అయితే, కార్యక్రమాల నిర్వహణ వేరేప్రాంతంలో నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈఅవకాశాన్ని అందిపుచ్చుకొని పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు అద్దంకి పట్టణానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు రంగంలోకి దిగాడు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు సిద్ధం చేసిన స్థలానికి పక్కనే ఉన్న ఎర్రకుంట స్థలంలో సుమారు ఎకరా భూమిని గత రెండు, మూడు రోజుల నుంచి చదును చేస్తున్నారు. ఎవరైన ప్రశ్నిస్తే ఆడుదాం ఆంధ్ర పోటీల కోసం చదును చేస్తున్నామని చెబుతుండటం గమనార్హం. ఒకవైపు నామ్ రోడ్డు, మరో వైపు శింగరకొండ రోడ్డు అత్యంత సమీపంలో ఉండటంతో ఎకరం ధర సుమారు రూ.4 కోట్ల పైగానే ఉండవచ్చని అంచనా. అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సుబ్బారెడ్డిని వివరణ కోరగా పరిశీలించి ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపడతానని తెలిపారు.


శింగరకొండ సమీపంలో చదును చేస్తున్న ప్రభుత్వ భూమి

పేదల అభివృద్ధే లక్ష్యం

- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు పథకాలు
- రాజ్యసభ సభ్యులు బాబుబాయ్ దేశాయ్

మేదరమెట్ల , జనవరి 5: కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి కోసం అనేక పథకాలు అందిస్తుందని గుజరాత్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు బాబుబాయ్‌దేశాయ్ తెలిపారు. శుక్రవారం మేదరమెట్ల మార్కెట్ యార్డులో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సబ్సిడీ అధిక మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు మూడు శాతం వడ్డీ రాయితీ ఇస్తుందని చెప్పారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకానికి నిధులను కేంద్రమే అందిస్తుందన్నారు. అందులో భాగంగా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణం కూడా అందులో భాగమే నన్నారు. మహిళలకు రాయితీపై వంట గ్యాస్ వంటి పథకాలను కేంద్రం అందిస్తుందన్నారు. కేంద్రం రాయితీ ఇస్తున్న చాలా పథకాల గురించి ప్రజలకు తెలియజెప్పడమే వికసిత్ సంకల్ప యాత్ర లక్ష్యమని చెప్పారు.

కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, మేదరమెట్ల సర్పంచ్ బోనిగల ఎలిశమ్మ, ఏపీఎం అనూరాధ, సంకల్పయాత్ర ఇన్‌చార్జ్ రాంబాబు, సమన్వయ కర్త అనుప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కార్యదర్శి మండవ రామకృష్ణ, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

అన్నిరంగాలలో అభివృద్ధే ధ్యేయం

యద్దనపూడి(మార్టూరు), జనవరి 5: ప్రపంచ దేశాల్లో 2047 నాటికి అన్ని రంగాల్లో భారత్‌ను అగ్రగామి దేశంగా నిలపాలనన్నదే బీజేపీ లక్ష్యమని ఆపార్టీ రాజ్యసభ సభ్యులు బాబుబాయ్ దేశాయ్ అన్నారు. బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో జిల్లా నాయకులు లంకా సాంబశివరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. భారతదేశాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో గ్రామాలల్లో క్షేత్రస్థాయిలో ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు అవగాహన చేసేందుకు ఈసంకల్ప యాత్రను ప్రారంభించినట్లు బాబుబాయ్ దేశాయ్ అన్నారు. అందుకు ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, మండవ రామకృష్ణ, కె.సాంబశివరావు, ఎంపీడీవో కృష్ణకుమారి, సర్పంచ్ మేకా సుధాకర్, ఎంపీటీసీ వంకాయల సునీత, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజు, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


మార్టూరు: పూనూరులో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బాబుబాయ్ దేశాయ్, ఎంపీడీవో కృష్ణకుమారి తదితరులు

11న కబడ్డీ పోటీలు

ఇంకొల్లు, జనవరి 5: ఇంకొల్లు మండలంలోని వంకాయలపాడులో శ్రీసాయిరామ గురుకుల్ స్కూల్ ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 11,12 తేదీలలో ఉదయం 9 గంటల నుండి బాపట్ల, ప్రకాశం(ఉమ్మడి) జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు ఆదర్శ స్కూల్ డైరెక్టర్ తోటకూర విజయభాస్కర్ తెలిపారు. మొదటి బహుమతి రూ. 15,666, 2వ బహుమతి రూ.10,666, 3వ బహుమతి రూ.7666, నాల్గో బహుమతి రూ.5666, ఐదో బహుమతి రూ.3666 అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8374149626 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇంకొల్లులో పారిశుధ్య కార్మికుల సమ్మె విరమణ


కార్మికులకు లిఖితపూర్వకంగా హామీ ఇస్తున్న ఇంకొల్లు పంచాయతీ కార్యదర్శి

ఇంకొల్లు, జనవరి 5: ఇంకొల్లు పంచాయతీ పారిశుధ్య కార్మికులు బకాయి జీతాల కోసం 14 రోజులుగా విధులు బహిష్కరించి చేపట్టిన సమ్మె శుక్రవారం విరమించినట్లు సీఐటీయూ మండల కార్యదర్శి వెంకట్రావు తెలిపారు.శుక్రవారం ఇంకొల్లు పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన గ్రామ సభలో పారిశుధ్య కార్మికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామస్థులు కార్మికుల పక్షాన వారి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. స్పందించిన గ్రామకార్యదర్శి కోటినాగయ్య మూడు నెలల జీతాలు ఈ నెల 12లోగా అందజేస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. దీంతో శని వారం నుంచి పారిశ్యు కార్మికులు యథావిధిగా విధుల్లోకి హాజరవుతారని తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

యద్దనపూడి(మార్టూరు) , జనవరి 5: యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో వ్యక్తి ఇంటిలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. అమృతికి గల కారణాలు తెలియలేదు. ఈవిషయంపై ఎలాంటి సమాచారం రాలేదని ఎస్‌ఐ నాగశ్రీను తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గ్రానైట్ కార్మికుడు మృతి

మార్టూరు , జనవరి 5: మార్టూరులోని ఓ గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న అస్సోం రాష్ట్రానికి చెందిన గ్రానైట్ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు సాయంత్రం ఆరు గంటల సమయంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని ద్విచక్రవాహనంపై తీసుకువచ్చినట్లు తెలిసింది. కొంతసేపటికే తీవ్రగాయాలైన వ్యక్తి మృతి చెందినట్లు తెలిసింది. ప్రభుత్వ ఆసుపత్రికి తిసుకువచ్చిన వ్యక్తులు అతని గురించి సమాచారం చెప్పకుండా వెళ్ళిపోయినట్లు తెలిసింది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావును వివరణ అడుగగా ఈవిషయపై పూర్తి సమాచారం సేకరిస్తున్నామన్నారు.

అంగన్‌వాడీలకు గౌరవమేదీ..!

- మాట తప్పిన సీఎం
- 25వ రోజుకు చేరిన సమ్మె

అద్దంకిటౌన్, జనవరి 5: అంగన్‌వాడీ కార్యకర్తలను అక్క, చెల్లెమ్మలు అంటూ హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట తప్పారని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జి.శారద అన్నారు. గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని సీఎం మాకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆమె ప్రశ్నించారు. తమ డిమాండ్‌ల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 25వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీలను ఆకులు తిని బతకమంటుందని, ఇచ్చిన హమీలను గద్దె నెక్కిన తరువాత పరిష్కరించ కుండా అంగన్‌వాడీలను మోసం చేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్ర మంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనిత, మనోలత, చంద్రామతి, భ్రమరాంబ, సౌభాగ్యం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించం!

బల్లికురవ, జనవరి 5: శ్రమకు తగ్గ వేతనం ఇచ్చేవరకు నిరవధిక సమ్మెను విరమించబోమని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం టీమ్ లీడర్ నాగమణి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. అధికారంలోకి రాక ముందు కల్లబొల్లి మాటలు చెప్పి ఇప్పుడు ముఖం చాటేసి అధికార పార్టీ నేతలు తిరుగుతున్నారని విమర్శించారు. ఎన్నిరోజులైన సమ్మె ను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో సం ఘ నేతలు అనురాధ, శ్రీలలిత, సునంద, సత్యవతి, సరస్వతి, జ్యోతి, శివపావని, వెంకటరమణ, అనుపమ, తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: తమ న్యాయమైన డిమాండ్‌లు తీర్చేవరకు సమ్మెను విరమించబోమని అంగన్‌వాడీ నాయకురాళ్లు చైతన్య, కాంత్రి తెలిపా రు. శుక్రవారం కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు తమ డిమాండ్‌ల సాధన కోసం 25 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హమీలను నెరవేర్చమని తాము అడుగుతున్నామన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నాలుగున్నరే ళ్లగా అమలు చేయకపోవడం, కనీసం చర్చలకు కూడా పిలవకపోవ డం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


పర్చూరు సీడీపీవో కార్యాలయం ముందు బైటాయించి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కారంచేడులో వినూత్న నిరసన

కారంచేడు(పర్చూరు), జనవరి 5: అంగన్‌వాడీలు తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ చేపట్టిన నిరవధిక నిరదీక్షలు హోరెత్తుతున్నాయి. ఆయా ప్రభుత్వ కార్యాలయాల ముందు వినూత్న రీతిలో ప్రభుత్వ వైఖరికి వ్యతిరేఖంగా నిరసన గళం వినిపిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కారంచేడు తహసీల్దార్ కార్యాలయం ముందు దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు.


కారంచేడులో దున్నపోతుకి వినతి పత్రం ఇస్తూ అంగన్‌వాడీల నిరసన

ఈసందర్భంగా పలువురు అంగన్‌వాడీ వర్కర్ల నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదన్నారు. సమ్మెను నీరుకార్చేందుకు ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడినా భయపడేది లేదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీలకు మద్దతుగా సీఐటీయూ నాయకులు నిలిచారు.

పంగులూరు: తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం సమ్మె చేపట్టిన అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం పంగులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మెకు వారు మద్దతు ప్రకటించారు. సమస్యల సాధనకోసం సమ్మె బాటపట్టిన కార్యకర్తలకు రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు రావి శ్రీనివాసరావు, టి.నరసింహారావు, బి.సుబ్బారావు, ప్రసాద్, ఏడుకొండలు, కేమా శ్రీను, శిరిగిరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


అద్దంకిలో ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

పర్చూరు, జనవరి 5: తమ న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృత్వం చేస్తామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. నివరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం పర్చూరులోని సీడీపీవో కార్యాలయం ముందు అంగన్‌వాడీలు బైటాయించి చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్రం కన్నా అదనంగా వెయ్యి రూపాయలు పెంచి ఇస్తామని కల్లబొల్లి మాటలతో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇప్పుడు ముఖం చాటువేస్తున్నారని విమర్శించారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యాకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


పింఛన్‌లు పంపిణీ చేస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి, జనవరి 5: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి అన్నారు. అద్దంకి మండలంలోని పలుగ్రామాలలో మంజూరైన వైయస్‌ఆర్ పెన్షన్ కానుక పత్రాలను లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అవిశన జ్యోతి, ఎంపీడీవో దేవసేన కుమారి, వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు గుజ్జుల జగన్మోహనరెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు అవిశన ప్రభాకరరెడ్డి, ఇస్తర్ల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.